www.flashindianews.com
# ఫ్లాష్ ఇండియా
తెలుగు దినపత్రిక
FLASH INDIA TELUGU DAILY
RNI NO. APTEL/2010/33229
TELANGANA RISING 2047

సంపుటి : 16 | సంచిక :126 | బుధవారం 18.06.2025 | ఎడిటర్ :కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-

# ఐదేళ్లలో రైతుల కోసం..
# ₹ 3,50,000 కోట్లు

## 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల నిధులు జమ చేస్తాం

### రైతు భరోసా దేశ చరిత్రలో రికార్డు
### కాంగ్రెస్ పై బీఆర్ఎస్ దుష్ప్రచారం



- మా ప్రభుత్వ హయంలో రైతులకు ఉచిత కరెంట్ ఇస్తున్నాం..
- రూ. 500 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నాం..
- అర్హులైన రైతులందరికీ రైతు భరోసా డబ్బులు పడతాయి: డిప్యూటీ సీఎం భట్టి

03

**భూపాలపల్లి ,ఫ్లాష్ ఇండియా :**

**అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా**

కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంట్ ఉండదని గత ప్రభుత్వ నేతలు దుష్ప్రచారం చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. కానీ తాము అధికారంలోకి వచ్చాక ఎంత డిమాండ్ ఉన్నప్పటికీ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నా మన్నారు. ఈ ఏడాది మార్చిలో గరిష్టంగా 17,162 మెగా వాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడిందని, నిరంతరాయ విద్యుత్ సరఫరాకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. 29 లక్షల పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తు న్నామని చెప్పారు.

## అభివృద్ధి చేసి చూపిస్తాం..!

- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం..
- ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను త్వరలోనే అమలు చేస్తామని వెల్లడి..
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతాం.. అభివృద్ధి చేసి చూపిస్తాం: మంత్రి శ్రీధర్ బాబు

03



## అహ్మదాబాద్-లండన్ విమానం రద్దు..

- అహ్మదాబాద్-లండన్ ఎయిరిండియా విమానం రద్దు..
- ప్రమాదం జరిగిన కొన్ని రోజుల తర్వాత నిర్ణయం..
- ఆపరేషనల్ కారణాలతో రద్దు చేస్తున్నట్లు చెప్పిన సంబంధిత వర్గాలు..

05

## పెట్రోల్ పంపు ఘరానా మోసం




- ఉప్పల్ లో భారత్ పెట్రోల్ పంపు ఘరానా మోసం
- యాజమాన్యం మిషన్ లో సెట్టింగ్ పెట్టి
- పెట్రోల్ తక్కువ పోస్తున్నట్లు వెల్లడైంది

06

## సెవెన్ హిల్స్ ఎక్స్ ప్రెస్ లో మంటలు

- తిరుపతి నుంచి సికింద్రాబాద్ వస్తున్న సెవెన్ హిల్స్ ఎక్స్ ప్రెస్ లో మంటలు
- సకాలంలో మంటలు ఆర్పివేశారు రైల్వే సిబ్బంది



06

# బీసీల జనాభా తక్కువ చేసి చూపించారు

### 42%రిజర్వేషన్లు ఇవ్వకుంటే స్థానిక ఎన్నికలు జరగనియ్యం
### బీసీ బిల్లును ఢిల్లీకి పంపించి కాంగ్రెస్ నేతలు చేతులు దులుపుకున్నారు




- బీసీ బిల్లు సాధన కోసం తెలంగాణ ఉద్యమ తరహా పోరాటం
- జులై 17న రాష్ట్రవ్యాప్తంగా రైల్ రోకో
- కేంద్రంపై ఒత్తిడి తీవ్రతరం చేసేలా కార్యాచరణ
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత


**మెదక్ ,ఫ్లాష్ ఇండియా :**

బీసీ రిజర్వేషన్ల కోసం జులై 17న రాష్ట్రవ్యాప్తంగా రైల్రోకో కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపు నిచ్చారు. 42% రిజర్వేషన్లు కల్పించకుండా రాష్ట్రం స్థానిక ఎన్నికలు జరగనియ్యమని స్ప ష్టంచేశారు.తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో మెదక్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు.. 'బీసీ బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తీవ్రతరం చేస్తం. బీసీ బిల్లు సాధన కోసం తెలంగాణ ఉద్యమ తరహా పోరాటం నిర్మిస్తం. అన్ని బీసీ సంఘాల నాయకులను కలుపుకొని రైల్ రోకో చేస్తాం. ఢిల్లీ పాలకులకు తెలంగాణ బీసీల పౌరుషాన్ని చాటుతాం. దక్కన్ పీఠభూమి నుంచి హస్తినకు సెగ తగిలేలా కార్యచరణ ఉంటుంది. బీసీలు అడగకపోతే తీరని నష్టం జరుగుతుంది. విద్యకు, ఉద్యోగాలకు, రాజకీయాలకు వేర్వేరు బిల్లులు పెట్టాలి. కామారెడ్డి డిక్లరేషన్ సాధించే వరకు పోరాడుతాం' అని అన్నారు.

# ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం

- ఇరాన్- ఇజ్రాయెల్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు..
- ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో అధికారులు హెల్ప్‌లైన్ ఏర్పాటు..
- భవిష్యత్ పరిణామాల దృష్ట్యా ముందు జాగ్రత్తగా హెల్ప్‌లైన్ ఏర్పాటు..

02



సహాయం అవసరమైన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించవచ్చు:
శ్రీమతి వందన,పి.ఎస్, రెసిడెంట్ కమిషనర్: +91 9871999044
శ్రీ జి. రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్: +91 9643723157
శ్రీ జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్: +91 9910014749
శ్రీ సిహెచ్. చక్రవర్తి, పౌర సంబంధాల అధికారి: +91 9949351270

# జీ7 నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయిన ట్రంప్

- జీ7 నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయిన ట్రంప్
- ఆగమేఘాలపై అమెరికాకు పయనం
- భద్రతా మండలి సమావేశంలో పాల్గొననున్న ట్రంప్

05



# విచారణలో కీలక పరిణామం

### రాష్ట్ర ప్రభుత్వానికి కాళేశ్వరం కమిషన్ లేఖ

- కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కీలక మలుపు తిరిగింది.
- ప్రాజెక్టుకు సంబంధించిన మంత్రివర్గ సమావేశాల తీర్మానాలను అందించాలని పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి లేఖ రాసింది.
- దీనిపై స్పందించిన సీఎం కమిషన్‌కు గత ప్రభుత్వ కేబినెట్ తీర్మానాల రికార్డులను అందించాలని ఆదేశించారు.

02



# కుల గణన చేయడానికి ఆలోచిస్తున్నారు!

- కుల గణనపై రాహుల్ గాంధీ ఎప్పుడో మాట్లాడారు..
- మోడీ బీసీ అయ్యుండి కూడా కుల గణన చేయడానికి ఆలోచిస్తున్నారు..
- రాష్ట్రంలోని బీసీ ఎంపీలు నోరు విప్పాలి.. లేకపోతే మీ ఇళ్ల ముందు ధర్నా చేస్తా: వి. హనుమంతరావు

03



# సిట్ విచారణకు కాంగ్రెస్ నేతలు

- మా ఫోన్లు ట్యాప్ చేసి రాజకీయ లబ్ది పొందేందుకు ప్రయత్నం
- ప్రజాస్వామ్యంలో రాజకీయ నేతల ఫోన్లో ట్యాప్ చేయడం హేయమైన చర్య
- హాజరైన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- ఎంపీ అనిల్కుమార్ యాదవ్ సహా పలువురు సైతం..
- ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులుగా వాంగ్మూలాలు
- జూబ్లీహిల్స్ పీఎస్కు భారీగా హస్తం శ్రేణులు
- పోలీసులు, కార్యకర్తల మధ్య స్వల్ప తోపులాట

03


### మావోయిస్టుల సానుభూతిపరుల పేరుతో మా ఫోన్లు ట్యాప్ చేశారు

### ఒకే రోజు 600 ఫోన్‌లను ప్రభాక్ రావు ట్యాప్ చేశారు



### సాక్షిగా హాజరైన మహేశ్ కుమార్ గౌడ్

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు సంచలనంగా మారింది. ఈ కేసులో ఇప్పటికే పలువురిపై కేసు నమోదు కాగా సిట్ విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ట్యాప్ చేసిన నెంబర్లలో తన నెంబర్ ఉండడంతో కొంత సమాచారం కావాలని సిట్ కోరడంతో సిట్ కార్యాలయానికి వెళ్లారు. సిట్ కు తన స్టేట్ మెంట్ ను ఇచ్చాడు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డితో పాటు నా ఫోన్ కూడా ట్యాప్ చేసి మా మూమెంట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారన్నారు. ఇదే ఫిర్యాదును గతంలో చేశాను.. ఇవాళ వాస్తవాలు బయటకు వచ్చాయని తెలిపారు.చట్టానికి వ్యతిరేకంగా అనేకమంది ఫోన్లు టాప్ చేశారు..




## డిఫెన్స్ మద్యం పట్టివేత

- హైదరాబాద్ లో డిఫెన్స్ మద్యం పట్టివేత
- మల్కాజిగిరిలో 37 బాటిల్లు
- మేడ్చల్ లో 24 బాటిల్ల మద్యం సీజ్

02

## రెడ్ జోన్ పరిధిలోకి ఆర్కే బీచ్ ఏరియా



- జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం
- యోగాంధ్ర 2025 కోసం ఏపీ ప్రభుత్వం ఏర్పాట్లు
- ప్రధాన వేదికగా ఆర్కే బీచ్ ఎంపిక రెడ్ జోన్ పరిధిలోకి ఆర్కే బీచ్ ఏరియా

05

## రాబర్ట్ వాద్రాకు మరోసారి ఈడీ సమన్లు

- రాబర్ట్ వాద్రాకు మరోసారి ఈడీ సమన్లు
- రేపు విచారణకు హాజరుకావాలని నోటీసు

02

### హైదరాబాద్

| | |
|---|---|
| 22 క్యారెట్ | రూ.93,050 |
| 24 క్యారెట్ | రూ.1,01,510 |
| కేజీ వెండి | రూ.1,19,900 |

### చికెన్ రేటు

| | |
|---|---|
| Dressed With Skin | 190 Kg |
| Skinless | 220 Kg |
| Boneless | 280 Kg |

# జూబ్లీహిల్స్ బై పోల్ పై సీఈవో

## జూబ్లీహిల్స్ బైపోల్ ఇప్పట్లో ఉండకపోవచ్చు

- అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ గెజిట్
- యథాతథంగా కేంద్ర ఎన్నికల సంఘానికి పంపాం
- ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో ఉప ఎన్నికల నోటిఫికేషన్
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

03

బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఖాళీ అయిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం స్థానంలో ఉప ఎన్నిక నిర్వహణపై తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్రెడ్డి కీలక ప్రకటన చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ నుంచి తమకు గెజిట్ అందిందని తెలిపారు.



## సీఎం ఇలాకాలో దారుణం

- చిత్తూరు జిల్లా కుప్పంలో దారుణ ఘటన
- మహిళను రోడ్డు పక్కన చెట్టుకు కట్టేసి దాడి
- భర్త తీసుకున్న డబ్బు చెల్లించాలని చెట్టుకు కట్టేసి దాడి



**ఆంధ్రప్రదేశ్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. అప్పు వసూలు చేసేందుకు మహిళను చెట్టు కట్టి, దాడి చేసిన అమానవీయ ఘటన కుప్పం పురపాలిక పరిధిలోని నారాయణపురంలో వెలుగు చూసింది. నారాయణపురానికి చెందిన తిమ్మరాయప్ప అదే గ్రామానికి చెందిన మునికన్నప్ప వద్ద రూ.80 వేలు అప్పు తీసుకున్నాడు. అప్పుల భారం భరించలేక ఊరు విడిచి పెట్టి వెళ్లిపోగా.. అతని భార్య శిరీష పుట్టిల్లు శాంతిపురం మండలం కెంచన బల్లలో ఉంటూ.. బెంగళూరులో కూలి పనులు చేసుకుంటూ కుమారుడిని పోషిస్తున్నారు.సోమవారం నారాయణపురం పాఠశాలలో కుమారుడి టీసీ తీసుకునేందుకు వచ్చిన శిరీషను మునికన్నప్ప, అతని భార్య మునెమ్మ, కుమారుడు రాజా, కోడలు జగదీశ్వరి పట్టుకొని.. భర్త తీసుకున్న డబ్బు చెల్లించాలని ఆమెతో వాగ్వాదానికి దిగారు. శిరీషను చెట్టుకు కట్టి దాడి చేయగా.. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మహిళను విడిపించారు. బాధితురాలి ఫిర్యాదుతో గంటన్నర వ్యవధిలోనే మునికన్నప్ప అతని భార్య వెంకటమ్మ, కొడుకు రాజా, కోడలు జగదీశ్వరిపై కేసు నమోదు చేసి నిందితులను కుప్పం పోలీసులు అరెస్టు చేశారు . వారిపై BNS 341/323/324/506/34/ IPC కింద కేసు నమోదు చేశారు .

## బోగస్ రేషన్ కార్డులపై 'సివిల్ సప్లై' ఫోకస్

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** రేషన్ లబ్ధిదారుల్లో అనర్హుల ఏరివేతపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ దృష్టి పెట్టింది. గత పదేళ్లలో ఎంతో మంది యువకులు ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లారు. ఎంతో మంది మరణించారు. అయితే వారి పేర్లు తొలగించకపోవడంతో ఇప్పటికీ రేషన్ పంపిణీ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా చర్యలు తీసుకునేందుకు పౌరసరఫరాల శాఖ సిద్ధమైంది. సుమారు 2.20 లక్షల పేర్లతో ఒక జాబితాను ఉన్నతాధికారులు ఇప్పటికే జిల్లాలకు పంపించినట్లు తెలిసింది. వివరాలు సేకరించి రిపోర్టు ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతో కార్డుల్లో పేరు ఉండి అందుబాటులో లేని, మరణించిన వారి పేర్లను గుర్తించేందుకు సిబ్బంది పక్షం రోజులుగా ఇంటింటి పరిశీలన చేస్తున్నారు. ఇలాంటి వారి పేర్లను తొలగించిన తర్వాత.. ధనవంతుల కార్డులను కత్తిరించాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ప్రారంభంలోనే అనర్హులను తొలగించాలని భావించింది. అయితే స్థానిక రాజకీయ నాయకుల అభ్యంతరాలతో ఆ ప్రక్రియను నిలిపివేసినట్లు తెలిసింది. ఈ నిర్ణయంతో స్థానిక ఎన్నికల్లో ఎఫెక్ట్ పడుతుందని, అప్పటివరకు వేచి చూడాలని కోరడంతో ఆ ప్రక్రియ వాయిదా పడింది. అయితే పంచాయతీ ఎన్నికల తరువాత అనర్హులకు రేషన్ కార్డులు తొలగించక తప్పదని పౌరసరఫరాల శాఖ అధికారులు సూచనప్రాయంగా చెబుతున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2లక్షల లోపు ఆదాయం ఉన్న వారికే రేషన్ కార్డులు అనే నిబంధనలు ఉన్నాయి. కానీ పట్టణ ప్రాంతాల్లో ధనవంతులు కూడ పెద్ద సంఖ్యలో రేషన్ కార్డులు పొందారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు, ఆరోగ్య శ్రీవంటి ఉచిత వైద్య సేవలకు వాటిని వినియోగిస్తున్నారు. ప్రభుత్వం నెలవారీగా పంపిణీ చేసే బియ్యం తీసుకోవడం లేదు. దుకాణాల వద్ద క్యూలైన్లలో ఉండాల్సిన అవసరం తమకు లేదని, డీలర్లకే ఆ బియ్యాన్ని అప్పగిస్తూ కిలోకు రూ. 10 చొప్పున తీసుకుంటున్నారనే చర్చ జరుగుతున్నది. దీంతో పీడీఎస్ రైస్ బ్లాక్ మార్కెట్ కు తరలిపోతున్నదనే విమర్శ ఉన్నది. ఇలాంటి వారి సంఖ్య రాష్ట్ర వ్యాప్తంగా 6.50 లక్షలు ఉండవచ్చని పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. అనర్హుల జాబితా పరిశీలన సమయంలో ధనవంతుల కార్డులు కూడా తొలగిస్తారని ముందుగానే లీకులు ఇస్తున్నారు.ఉచిత రేషన్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.10,655 కోట్లు ఖర్చు చేస్తున్నాయి. అందులో రాష్ట్రం వాటా రూ. 5,175 కోట్లు కాగా, కేంద్రం రూ. 5,485 కోట్లు భరిస్తున్నది. అయితే గత ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వంపై అదనంగా రూ. 2,858 కోట్ల భారం పడుతున్నది. మరోవైపు ఇటీవల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో లబ్ధిదారుల సంఖ్య కూడా భారీగా పెరిగింది. గత బీఆర్ఎస్ పాలనలో 2.83 కోట్ల మంది లబ్ధిదారులు ఉంటే.. ప్రస్తుతం ఆ సంఖ్య 3.10 కోట్లకు చేరింది. ఇంతమందికి ఉచితంగా ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేయడం ప్రభుత్వానికి ఆర్థికంగా భారంగా మారింది. అందుకోసం ముందుగా అడ్రస్ లేని, మరణించిన వారి పేర్లు తొలగించాలని భావిస్తున్నది. ఆ తర్వాత ధనవంతుల కార్డులనూ కట్ చేస్తే రూ. 500 కోట్ల భారం తగ్గుతుందని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. పేద, మధ్యతరగతి ప్రజల పేర్లు తొలగిస్తేనే సమస్యలు వస్తాయని, ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న వారి పేర్లు తొలగిస్తే ఎలాంటి సమస్యలు ఉండవని ప్రభుత్వం భావిస్తున్నది. వారు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేసే పరిస్థితులు కూడా ఉండవని అనుకుంటున్నది.

## తక్షణమే టెహ్రాన్ ఖాళీ చేయండి

**ఢిల్లీ :** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య పరిస్థితులు చేదాటుతున్నాయి. ఇరు పక్షాలు భీకరంగా దాడులు చేసుకుంటున్నాయి. ఇక మంగళవారం తెల్లవారుజామున టెహ్రాన్ పై ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. భారీ పేలుళ్లు, వైమానిక దాడులు జరిగాయని ఇరాన్ రాష్ట్ర మీడియా తెలిపింది. అలాగే ఇరాన్ కూడా ఇజ్రాయెల్ పై ప్రతీకార దాడులు చేస్తోంది. దీంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య పరిస్థితులు ఉధృతం అవుతున్న వేళ భారత్ అప్రమత్తం అయింది. తక్షణమే పౌరులు టెహ్రాన్ ఖాళీ చేయాలని భారత రాయబార కార్యాలయం తెలిపింది. టెహ్రాన్ పై ఇజ్రాయెల్ డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించే అవకాశం ఉందని.. తక్షణమే భారత సంతతికి చెందిన వ్యక్తులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరింది. సొంత వనరులు ఉపయోగించుకుని వెళ్లిపోవాలని తెలిపింది.ఇక అత్యవసర పరిస్థితుల్లో భారతీయ పౌరులందరూ వెంటనే రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కూడా కోరింది. ఎలాంటి అవసరత వచ్చినా ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని కోరింది. **+989010144557,+989128109115, +989128109109** నెంబర్లకు కాల్ చేయాలని తెలిపింది.


## డిఫెన్స్ మద్యం పట్టివేత

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ లో డిఫెన్స్ మద్యం పట్టుబడింది. మల్కాజిగిరిలో 37 బాటిల్లు, మేడ్చల్ లో 24 బాటిల్ల మద్యం సీజ్ చేశారు అధికారులు. ఎక్స్ ఆర్మీ పర్సన్ ను అరెస్ట్ చేశారు. ఎక్స్ ఆర్మీకి చెందినటువంటి ఇద్దరూ వ్యక్తులు రెండు చోట్ల మద్యం అమ్మకాలు జరుపుతున్నారు అనే సమాచారం మేరకు మల్కాజిగిరి ఏఈఎస్ ముకుంద రెడ్డి బృందం రెండు చోట్ల దాడి చేసి 37 డిఫెన్స్ మద్యం బాటిల్లను సీజ్ చేశారు. పట్టుబడినటువంటి టిఫిన్స్ మద్యం బాటిళ్లు కర్ణాటక చెందినవిగా గుర్తించారు.డిఫెన్స్ క్యాంటీన్ లో నెలవారీగా వచ్చే కోటాను కొంతమంది వద్ద బాటిల్లను కొనుగోలు చేసి ఎక్స్ సర్వీస్ మెన్ పురుషోత్తం యాప్రాల్ లో, ముప్పరపు సిద్దయ్య ఆర్మీ పర్సనల్ కౌకూర్ లో అమ్మకాలు జరుపుతుండగా పట్టుకున్నట్లు ఏ ఎస్ బి ముకుంద రెడ్డి తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ రూ. 75 వేలుగా ఉంటుందని అంచనా వేశారు. మద్యం బాటిల్స్ పట్టుకున్న వారిలో ఏఈఎస్ ముకుంద రెడ్డితో పాటు సీఐ భరత భూషణ్ డిటిఎఫ్ ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ రెడ్డిలు సిబ్బంది ఉన్నారు. మద్యం బాటిల్ పట్టుకున్నటువంటి సిబ్బందిని ఎక్సైజ్ సూపరిండెంట్ నవీన్ అభినందించారు.మేడ్చల్ ఈఎస్ పరిధిలో హర్యానాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చేటువంటి లేబర్ వారు తీసుకొచ్చుకునేటువంటి మద్యం బాటిల్లను మేడ్చల్ సిఐ నవనీత ఏఈ ఎస్ మాధవయ్య డిటిఎఫ్ నర్సిరెడ్డిలు సిబ్బంది కలిసి వాహనాలు, బస్సులు నిలిపే ప్రాంతాల్లో తనిఖీలు చేసి 24 మద్యం బాటిల్లను సీజ్ చేసినట్లు మేడ్చల్ ఎక్సైజ్ సిఐ నవనీత తెలిపారు. పట్టుకున్న మద్యం బాటిల్లో విలువ రూ. 48 వేలుగా ఉంటుందని అంచనా వేశారు. మద్యం బాటిల్లను పట్టుకున్నటువంటి సిబ్బందిని సిఐని ఎక్సైజ్ సూపర్ రేటెండెంట్ ఎస్.కె ఫయాజుద్దీన్ అభినందించారు.

## విచారణలో కీలక పరిణామం

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. కాళేశ్వరంపై కేబినెట్ తీర్మానాలపై కమిషన్ ఆరా తీస్తోంది. ఈ మేరకు పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి లేఖ రాసింది. కాళేశ్వరంపై మంత్రివర్గ తీర్మానాలను ఇవ్వాలని కోరింది. కేబినెట్ తీర్మానాల మేరకే నిర్ణయాలు జరిగాయని కమిషన్ విచారణలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, నాటి మంత్రి, ప్రస్తుత ఎంపీ ఈటెల రాజేందర్ చెప్పారు. ఈ నేపథ్యంలో కేబినెట్ తీర్మానాల వివరాలు ఇవ్వాలని కమిషన్ కోరింది. అయితే కాళేశ్వరంకు కేబినెట్ ఆమోదం లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం గత ప్రభుత్వ కేబినెట్ తీర్మానాల రికార్డులను ప్రభుత్వం కమిషన్ కు పంపించనుంది.కాగా కాళేశ్వరం ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్, ఈటలను కమిషన్ విచారించిన విషయం తెలిసిందే. కేబినెట్ ఆమోదంతో అన్ని నిర్ణయాలు తీసుకున్నామని కేసీఆర్, హరీష్‌రావు, ఈటల చెప్పడంతో కమిషన్ ఇప్పుడు కీలక నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టుకి సంబంధించి ఆనాటి మంత్రివర్గ తీర్మానాలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ నెల 13న నీటిపారుదలశాఖకు కూడా లేఖ రాసింది. కాళేశ్వరం కమిషన్ రాసిన లేఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. నిన్న (సోమవారం) మంత్రుల సమావేశంలో చర్చించారు. అంతేకాదు కమిషన్‌కు అన్ని వివరాలు ఇవ్వాలని అధికారులను కూడా ఆదేశించారు.

## హైదరాబాద్‌లోనే నా ఫోన్ ట్యాప్ చేశారు



**ఆంధ్రప్రదేశ్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త ట్విస్ట్ చోటు చేసుకుంది. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఫోన్ ట్యాపింగ్ పై సంచలన ఆరోపణలు చేశారు. తన ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయని షర్మిల ఆరోపించారు. హైదరాబాద్ లోనే తన ఫోన్ ట్యాప్ చేశారని అన్నారు. తాను ఎవరెవరితో మాట్లాడుతున్నానో ఎప్పటికప్పుడు జగన్ కు చేరవేశారని అనుమానం వ్యక్తం చేశారు. ట్యాపింగ్ గుర్తించి వ్యక్తిగత ఫోన్లను మార్చినట్టు చెప్పారు. ఇదిలా ఉంటే షర్మిల కోసం ప్రభాకర్ రావు టీమ్ కోడ్ లాంగ్వేజ్ ఉపయోగించారని ఆరోపణలు వ స్తున్నాయి. ప్ర స్తుతం ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్ర ధాన నింధితుడుగా ఉన్న ప్రభాకర్ రావు విచారణ ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. గత కొంత కాలంగా విదేశాల్లో ఉన్న ఆయన ఇప్పుడు సిట్ విచారణకు హాజరవుతున్నారు. 600 మంది ఫోన్లు ట్యాపింగ్ కు గురైనట్టు అధికారులు నివేధిక సిద్ధం చేశారు. నివేధిక ఆధారంగా ప్రభాకర్ రావుకు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

## రాబర్ట్ వాద్రాకు మరోసారి ఈడీ సమన్లు

- రాబర్ట్ వాద్రాకు మరోసారి ఈడీ సమన్లు
- రేపు విచారణకు హాజరుకావాలని నోటీసు



**ఢిల్లీ :** వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాకు మరోసారి ఈడీ సమన్లు జారీ చేసింది. యూకేకు చెందిన ఆయుధాల వ్యాపారి సంజయ్ భండారీతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసులో ఈడీ సమన్లు జారీ చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ కింద వాంగ్మూలం నమోదు చేయడానికి బుధవారం ఈడీ ప్రధాన కార్యాలయానికి రావల్సిందిగా ఈడీ నోటీసులో పేర్కొంది.ఈనెల 10న విచారణకు హాజరు కావాలని ఈడీ నోటీసులు ఇచ్చింది. అయితే ఈ నెలాఖరులో విదేశీ పర్యటనకు ముందుగానీ.. తర్వాత గానీ హాజరవుతానని వాద్రా తెలిపారు. తన కుమార్తె గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొనడానికి విదేశాలకు వెళ్తున్నట్లు ఈడీకి తెలియజేశారు. ఇంకా ఎమర్జెన్సీగా హాజరు కావాలంటే వర్చువల్ గా హాజరవుతారని న్యాయవాది సమాచారం అందించారు. మొత్తానికి ఆయా కారణాలు చెప్పి తప్పించుకున్నారు. తాజాగా మరోసారి అధికారులు నోటీసులు ఇచ్చారు. బుధవారం విచారణకు హాజరవుతారా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది.వాద్రా వాంగ్మూలం నమోదు చేసిన తర్వాత ఛార్జిషీట్ దాఖల చేయాలని ఈడీ భావిస్తోంది. ఇదిలా ఉంటే రాజకీయ ప్రయోజనాల కోసం తనను వేధిస్తున్నారని.. ఇబ్బంది పడుతున్నారని రాబర్ట్ వాద్రా ఆరోపిస్తున్నారు. వివిధ మనీలాండరింగ్ కేసుల్లో గతంలో మూడు రోజుల పాటు వాద్రాను ఈడీ అధికారులు విచారించారు.

## ఉక్రెయిన్‌పై రష్యా దాడి


- 14 మంది మృతి.. 40 మందికి తీవ్రగాయాలు



**ఢిల్లీ :** ఓ వైపు ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు జరుగుతుండగా.. ఇంకోవైపు రష్యా-ఉక్రెయిన్ మధ్య కూడా వార్ ఉధృతం అవుతోంది. తాజాగా కీవ్ పై రష్యా క్షిపణి దాడులకు పాల్పడింది. బహుళ అంతస్థుపై డ్రోన్ ను ప్రయోగించగా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. 40 మందికి పైగా తీవ్రగాయాలు పాలయ్యారు.కీవ్ లో డజన్లకొద్దీ అపార్ట్ మెంట్లు ధ్వంసమయ్యాయని ఉక్రెయిన్ సైనిక అధికారి తెలిపారు. భవనాల శిథిలాల కింద అనేకమంది ప్రజలు చిక్కుకున్నారని.. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఘటనా స్థలాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ దాడిలో అమెరికా పౌరుడు కూడా మరణించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ.. కెనడా జీ7 సదస్సులో పాల్గొన్నారు.ఓ వైపు రష్యా-ఉక్రెయిన్ చర్చలు జరుగుతుండగానే ఇరు పక్షాలు దాడులకు దిగుతున్నాయి. ఇటీవల ఇస్తాంబుల్ వేదికగా జరిగిన చర్చల తర్వాత ఇరు పక్షాల యుద్ధ ఖైదీలను విడుదల చేసుకున్నాయి. ఇంకా చర్చలు జరుగుతుండగానే తాజాగా రష్యా దాడులకు పాల్పడింది.జీ 7 సదసులో భాగంగా జెలెన్ స్కీ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో సమావేశం కావాల్సి ఉంది. అయితే ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అర్ధాంతరంగా ట్రంప్ అమెరికా వెళ్లిపోయారు. భద్రతా మండలి సమావేశం నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

## ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య యుద్ధ వాతావరణం రోజు రోజుకు తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు చేసింది. ఈ ఇరు దేశాల్లో నివసిస్తున్న లేదా ప్రయాణిస్తున్న తెలంగాణ వాసులు, విద్యార్థులకు సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రత్యేక హెల్ప్ లైన్ ప్రారంభించింది. విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఇరు దేశాల భారత రాయబార కార్యాలయ సమాచారం ప్రకారం ఇప్పటివరకు తెలంగాణకు చెందిన ఎవరూ ఈ ఉద్రిక్తతల కారణంగా ప్రభావితం అయినట్లు సమాచారం అందలేదు. అయినప్పటికీ భవిష్యత్ పరిణామాల దృష్ట్యా ఈ హెల్ప్ లైన్ ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో, ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదిస్తూ అవసరమైతే తక్షణం సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. సహాయం కోసం +91 9871999044 (వందన,పి.ఎస్, రెసిడెంట్ కమిషనర్), +91 9643723157 (జి.రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్), +91 9910014749 (జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్), +91 9949351270 (సిహెచ్. చక్రవర్తి, పౌర సంబంధాల అధికారి) నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.



## ప్రభుత్వ టీచర్ల పిల్లలు కార్పోరేట్‌కు..

- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు యత్నం
- మారని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల తీరు
- తమ పిల్లల్ని ప్రైవేటు, కార్పోరేటు పాఠశాలలకు పంపుతున్నారు
- ఇలా అయితే.. సాధారణ ప్రజల్లో నమ్మకం వచ్చేది ఎలా?



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. అన్ని స్థాయిల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలను ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. ప్రభుత్వ టీచర్లలో బోధనా సామర్థ్యం పెంచేందుకు ఈసారి శిక్షణ కూడా ఇచ్చారు. ఇప్పటికే.. రాష్ట్రంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా మారాయి. మంచి భవనాలు, రంగురంగుల బొమ్మలతో గోడలు, అత్యాధునిక వసతులతో క్లాస్ రూమ్ లు, నాణ్యమైన విద్యాబోధన, పైగా ఇంగ్లిష్ మీడియం కూడా ప్రవేశ పెట్టారు. ప్రభుత్వం ఏం చేసిన కొందరి తీరు మాత్రం మారడం లేదు.ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల తీరు మాత్రం అస్సలు మారడం లేదు. వాళ్లు మాత్రం తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు.. బడి బాట లాంటి కార్యక్రమాల్లో మాత్రం సాధారణ ప్రజల పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలకు పంపాలని నినాదాలు, ఉపన్యాసాలు ఇస్తున్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇప్పటికీ సర్కారు పాఠశాలలపై నమ్మకం కలగడం లేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం కావాలి.. కానీ ప్రభుత్వం బడి వద్దా? అంటూ నిలదీస్తున్నారు. కానీ ఆయా ఉపాధ్యాయులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు ప్రవర్తిస్తున్నారు. మొదట ఈ టీచర్ల తీరులో మార్పు రావాలని యువకులు కోరుతున్నారు. మీరే ప్రభుత్వ పాఠశాలలను విశ్వసించకుంటే.. సాధారణ ప్రజలు ఎలా నమ్ముతారు? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. ప్రైవేటు శక్తులు విద్యను వ్యాపారంలా మార్చేశాయి. మధ్యతరగతి కుటుంబం ఇద్దరు పిల్లలను కూడా ప్రైవేటు బడుల్లో చదివించలేకపోతోంది. జీతం కంటే పాఠశాలల ఫీజులే అధికమవుతున్నాయి. అయినా తమ పిల్లలకు మంచి భవిష్యత్తును అందించాలని తల్లిదండ్రులు రాత్రింబవళ్లు కష్టపడుతూ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నారు.సర్కారు బడులు రాను రాను మారుతున్నాయి. ఇటీవల రేవంత్ ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధన సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర విద్యాశాఖ.. ప్రముఖ స్వచ్ఛంద సంస్థలతో ఇటీవల పరస్పర అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఆరు ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన ఎడ్ టెక్ సదుపాయాలు కల్పించనుంది.

**ఆ ఆరు సంస్థలు ఇవే..**

నందన్ నీలేకని నేతృత్వంలోని ఏక్ స్టెప్ ఫౌండేషన్ : కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ప్లాట్ ఫాంతో 540 పాఠశాలల్లో ఇప్పటికే పనిచేస్తోంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో ఐదు వేలకు పైగా ప్రాథమిక పాఠశాలలకు తన సేవలు విస్తరించనుంది. మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ భాషలతో పాటు గణితంలో ప్రాథమికాంశాలను ఈ సంస్థ బోధిస్తుంది.

## కామ్రేడ్ పోలేపల్లి గురువయ్య కి జోహార్ లు....



**ఫ్లాష్ ఇండియా,మిర్యాలగూడ ప్రతినిధి:** దామచర్ల మండలం బొత్తలపాలెం గ్రామ సిపిఐ పార్టీ సభ్యుడు పోలేపల్లి గురువయ్య అనారోగ్యంతో బాధపడుతూ బొత్తలపాలెం గ్రామంలో తుది శ్వాస విడిచారు.మిర్యాలగూడ నియోజకవర్గ పార్టీ సభ్యులు ప్రజాసంఘాల నాయకులు గురువయ్య పార్థివ దేహానికి ఎర్రజెండా కప్పి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. గురవయ్య మరణం సిపిఐ పార్టీకి తీరని లోటు అని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు,ఏ ఐ టి యు సి జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సయ్యద్,మండల కార్యదర్శి లు ధీరావత్ లింగ నాయక్ ,అంజనపల్లి రామలింగం,జిల్లా యాదగిరి,దామరచర్ల మండలం సహకార దర్శి ధానావత్ శాంతి మండల సమితి సభ్యులు పోలేపల్లి ఉదయ్,జమ్ముల కోటయ్య,లక్ష్మయ్య తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

## కేటీఆర్ కనీసం సిగ్గైనా ఉండాలి కదా

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఫార్ములా ఈ-రేసు కేసును లొట్టపీసు కేసు అని కామెంట్ చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ .. తప్పు చేయనప్పుడు అరెస్ట్ కు ఎందుకు భయపడు తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన దిమ్మతిరిగే తీర్పుతో ఈ మధ్య కల్వకుంట్ల కుటుంబం కేవలం ఫామ్ హౌస్ కే పరిమితమైందని.. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు సైతం వరుస కేసులతో ప్రజా సేవను గాలికొదిలేశారంటూ ఫైర్ అయ్యారు. ఫార్ములా ఈ-రేసు కేసును లొట్టపీసు కేసు అన్న కేటీఆర్ పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా.. లోపల భయంతో వణికిపోతున్నాడని తెలిపారు. సోమవారం ఏసీబీ విచారణ హాజరై బయటకు వచ్చిన వెంటనే.. కేటీఆర్ కు బీఆర్ఎస్ వర్గాలు బాణాసంచా కాల్చి స్వాగతం పలకడం ఏంటని ప్రశ్నించారు. అరెస్ట్ చేయనుందుకు సంబురాలు చేసుకుం టున్నారా అని దుమ్ము దులిపారు. తప్పు చేసినోళ్లకు రాచమర్యాదలట.. బావ, బావమ రుదుల ఆలింగనాలట అంటూ సెటైర్లు వేశారు. తెలంగాణ ప్రతిష్టను నాశనం చేసి గొప్పలు చెప్పుకుంటున్న కేటీఆర్ కు సిగ్గుండాలని ఆది శ్రీనివాస్ ఫైర్ అయ్యారు.

# సిట్ విచారణకు కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు సంచలనంగా మారింది. ఈ కేసులో ఇప్పటికే పలువురిపై కేసు నమోదు కాగా సిట్ విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ట్యాప్ చేసిన నెంబర్లలో తన నెంబర్ ఉండడంతో కొంత సమాచారం కావాలని సిట్ కోరడంతో సిట్ కార్యాలయానికి వెళ్లారు. సిట్ కు తన స్టేట్ మెంట్ ను ఇచ్చాడు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డితో పాటు నా ఫోన్ కూడా ట్యాప్ చేసి మా మూమెంట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించా రన్నారు. ఇదే ఫిర్యాదును గతంలో చేశాను.. ఇవాళ వాస్తవాలు బయటకు వచ్చాయని తెలిపారు.చట్టానికి వ్యతిరేకంగా అనేకమంది ఫోన్లు టాప్ చేశారు.. ప్రజాస్వామ్యంలో రాజకీయ నేతల ఫోన్లో ట్యాప్ చేయడం హేయమైన చర్య.. ఇలాంటి చర్యకు పాల్పడ్డ నాటి సీఎం కేసీఆర్, కేటీఆర్ ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేశారని మండిపడ్డారు. మేము మాత్రమే శాశ్వతంగా అధికారంలో ఉండాలి అనే చెడు ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.. 2018లో మేము ఓడిపోవ డానికి కారణం కూడా మా నాయకుల ఫోన్స్ ట్యాప్ చేయడం వాళ్లే అని అర్థమైంది అని అన్నారు. 2022 నుంచి సీనియర్ కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ లో ఉన్నాయన్నారు.సిట్ దర్యాప్తులో 650 మంది కాంగ్రెస్ నాయకుల పేర్లు జాబితాలో ఉన్నాయి.. అనిల్ కుమార్ యాదవ్, అనిల్ తోపాటు అనేకమంది ఫోన్లు టాప్ అయినట్లు బయటికి వస్తుంది.. నాడు ఏరకంగా అధికారాన్ని దుర్వినియోగం చేసి దుశ్చర్యకు పాల్పడ్డారో అర్థం అవుతుంది. ప్రజాస్వామ్యంలో నిక్కచ్చిగా పనిచేయాల్సిన టువంటి అధికారులు... ఏ రకంగా రాజకీయ నాయకుల కు తలొగ్గి అడుగులకు మడుగులు ఒత్తారో అర్థమవుతుందన్నారు. ప్రైవసీ అనేది మా ప్రాథమిక హక్కు.. దానిని కాలరాశారు.. రిటైర్డ్ అయిన ప్రభాకర్ రావును దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా ఇంటెలిజెన్స్ చీఫ్ గా పెట్టి దుశ్చర్యకు పాల్పడడం సిగ్గుచేటు అని ఫైర్ అయ్యారు.నా పూర్తి పేరు పెట్టకుండా నక్సలైట్లకు సింపథైజర్లుగా ఉన్నారని ట్యాప్ చేయడం సిగ్గుచేటు.. కేటీఆర్ సిగ్గుతో తల దించుకోవాలి.. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ మా ఫోన్లను ట్యాప్ చేయడం దుర్మార్గమైన చర్య.. ఆనాడు మా ఫోన్లు ట్యాప్ చేసి రాజకీయ లబ్ది పొందేందుకు ప్రయత్నం చేశారు దానికి మీరు శిక్షార్హులు. భవిష్యత్తులో మరే ప్రభుత్వం కూడా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండాలంటే వీరికి శిక్ష పడాల్సిందేనని అన్నారు. ఇలాంటి దిగజారుడు పనికి ఒడిగట్టిన ఐఏఎస్ ఐపిఎస్ అధికారులకు కూడా శిక్ష పడాలన్నారు.సజావుగా విచారణ జరిపి... రాజకీయ నాయకులైన, అధికారులైన... కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.. దేశ చరిత్రలో ఇంతటి హేయమైన చర్యకు పాల్పడడం ఇదే ప్రథమం.. కెసిఆర్ కేటీఆర్ లు రాజకీయ అవసరాల కోసం రాజకీయ నాయకులు, వ్యక్తులు, విలేకరులు, అధికారులు, న్యాయమూర్తుల ఫోన్లు కూడా ట్యాప్ చేయడం హేయమైన చర్య.. టిడిపి బిజెపి నేతల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు.. మా పార్టీని నాశనం చేసేందుకు నా కదలికలను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు ఈ ఫోన్ ట్యాపింగ్ చేసినందుకు వారిని కఠినంగా శిక్షించాలన్నారు.నా పేరు కూడా పూర్తిగా మెన్షన్ చేయకుండా నా ఫోన్ ట్యాపింగ్ లో ఉందని పోలీసులు చెప్పారు.. మావోయిస్టులకు సహకరిస్తున్నారని ఉద్దేశంతో ఫోన్ ట్యాప్ చేసినట్లు ప్రభాకర్ రావు చెప్పాడట.. ప్రభాకర్ రావు నాటి సిఎస్ ఇద్దరు కలిసి ఎన్నికల ముందు రెండు సంవత్సరాలు ఫోన్ ట్యాప్ చేశారు. ఆ హార్డ్ డిస్కులను కూడా ధ్వంసం చేశారు.. ఆనాడు ఆకస్మాత్తుగా మా కార్లు ఆపేవారు.. ఆపి తనిఖీలు చేసేవారు.. అనుక్షణం పోలీసులు మమ్మల్ని నీడలా వెంటాడేవారు.. అకారణంగా అనేకసార్లు గృహనిర్బంధాలు చేశారు అని తెలిపారు.

## బీసీల జనాభా తక్కువ చేసి చూపించారు

**మెదక్ ,ఫ్లాష్ ఇండియా :** మెదక్ లో కామారెడ్డి డిక్లరేషన్ సాధన కోసం బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ప్రతి జిల్లాలో సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు. UPF, తెలంగాణ జాగృతి బీసీల కోసం పోరాడుతున్నాయి.. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసే వరకు ఈ పోరాటం ఆగదని తెలిపారు. మెదక్ లో బీసీల సమావేశం పెడితే కొందరు బెదిరిస్తున్నారని తెలిసింది.. ఇది రాజకీయ వేదిక కాదు.. బీసీల హక్కుల కోసం మేం పోరాడుతున్నామని వెల్లడించారు.సరైన సమయంలో జాగృతి, UPF మాట్లాడింది కాబట్టి అసెంబ్లీలో రెండు బిల్లులు పెట్టారు.. బీసీ బిల్లును ఢిల్లీకి పంపించి కాంగ్రెస్ నేతలు చేతులు దులుపుకున్నారు.. మెదక్ ఎంపీ రఘునందన్ రావు బీసీ బిల్లు గురించి ఒక్కరోజైనా మాట్లాడారా..? బీసీ బిల్లుకు బిజెపి ఎందుకు మద్దతు ఇవ్వట్లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కులగణనలో బీసీల జనాభా తక్కువ చేసి చూపించారు.. మీరు చిత్తశుద్ధిగా కుల గణన చేస్తే ప్రతి గ్రామంలో లెక్కలు బయటపె ట్టాలని డిమాండ్ చేశారు.జులై 17న రాష్ట్రవ్యాప్తంగా రైల్ రోకో చేస్తామని హెచ్చరించారు. బీసీ బిల్లు కోసం అన్ని సంఘాలను కలుపుకొని కార్యక్రమం చేస్తామన్నారు. ఢిల్లీలో కూర్చున్న నాయకులకు దక్కన్ పీఠభూమి శక్తి ఏంటో తెలియాలి.. బీసీ బిల్లు వచ్చే లోపు కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికలు చేపట్టాలని ప్లాన్ చేస్తుంది.. బిసిలకు రిజర్వేషన్ ఇవ్వకుండా ఎన్నికలకు పోతే కాంగ్రెస్ పార్టీకి సెగ తగిలేలా చేస్తామని హెచ్చరించారు.

## బస్ భవన్ వద్ద ఉద్రిక్తత



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ధర్నాతో ఆర్టీసీ క్రాస్ రోడ్ లో ఉన్న బస్ భవన్ వద్ద ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇటీవల ఆర్టీసీ యాజమాన్యం స్టూడెంట్ బస్ పాస్ ల ఛార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. బస్ పాస్ ఛార్జీల పెంపు.. పేద, మధ్య తరగతి విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఆర్టీసీ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ నేతలు, విద్యార్థి సంఘాల నేతలు ఆందోళన చేస్తున్నారు.ఇందులో భాగంగానే ఈ రోజు ఉదయం ఎవరూ ఊహించని విధంగా.. ఏబీవీపీ నేతలు , విద్యార్థులతో కలిసి బస్ భవన్ వద్దకు దూసుకొచ్చి.. ముట్టడికి ప్రయత్నించారు. ఇది గమనించిన పోలీసులు వారిని అడ్డుకో వడంతో బస్ భవన్ గేటు ముందు బైఠాయించి.. పెంచిన బస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వారిని అదుపు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు ఏబీవీపీ నేతలను, విద్యార్థులను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలిం చినట్లు తెలుస్తోంది.

## తెలంగాణ ప్రాజెక్టులకు సీఎం సానుకూలం

**ఆంధ్రప్రదేశ్ :** పోలవరం బనకచర్ల వలన ఎగువ రాష్ట్రాలకు ఎటువంటి నష్టం లేదని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. గోదావరి నదికి విభజిత ఆంధ్ర ప్రదేశ్ చివరి రాష్ట్రం అన్నారు. సచివాలయంలో ఈరోజు ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏటా గోదావరి నుంచి 3 000 టీఎంసీలు నీరు వృధాగా సముద్రంలోకి పోతుందన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా ఒక్కసారిగా 50 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించే అవకాశం వున్న నది గోదావరి అని తెలిపారు . ఇది ఏ ఎగువ రాష్ట్రానికి వ్యతిరేకం కాదు, నష్టం చేకూర్చేది అంతకన్నా కాదని తెలిపారు. వృధాగా సముద్రంలోకి పోయే నీటిని బనకచర్లకు తరలిస్తామన్నారు. పోలవరం వద్ద లభ్యం అయ్యే గోదావరి వరద జలాలను మాత్రమే వాడుకుంటామని తెలిపారు. ఎక్కడ తాము నికర జలాలను వాడడం లేదన్నారు.బనకచర్ల నుంచి వినియోగించే గోదావరి వరద జలాలు దేశంలో రెండో అతి తక్కువ వర్షపాతం ఉన్న రాయలసీమ ప్రాంతానికి ఉపయోగించబడు తుందన్నారు. ఫ్లోరైడ్ బాధ్యత ప్రాంతం అయినా రాయలసీమకు ఈ ప్రాజెక్టు ద్వారా నీరు అందుతుందన్నారు. గోదావరి కృష్ణ బోర్డుల అనుమతి లేకుండా కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టులు చేపట్ట లేదా అని ప్రశ్నించారు. ఏపీ పునర్ విభజన చట్టానికి విరుద్ధంగా వారి ప్రాజెక్టులకు ఇప్పటికీ అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేకుండా నిర్మించడం నిజం కాదా అని అడిగారు. అనుమతులు లేని చాలా ప్రాజెక్టులకు టెండర్లు పిలిచి పనులు చేపట్టడం లేదా అని అన్నారు. కాళేశ్వరం సీతారామ ప్రాజెక్టు, పాలమూరు, రంగారెడ్డి, సమ్మక్క బ్యారేజీ మొదలైన ప్రాజెక్టులను ఏ విధమైన అనుమతులు లేకుండా కడుతున్నారని ఆరోపించారు. పూర్తయిన సమ్మక్క బ్యారేజ్ కి, పురోగతిలో ఉన్నటువంటి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు ఈరోజుకు అనుమతి లేదన్నారు.తెలంగాణ ప్రాజెక్టులకు అప్పుడు ఇప్పుడు చంద్రబాబు నాయుడు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణలో తగిన మదింపు లేకుండా ఎగువన ప్రాజెక్టులు కడితే నష్టపోయేది ఏపీ రైతులన్నారు. దిగువ పరివాహక ప్రాంతాల ప్రత్యేక హక్కులు గురించి మాత్రమే చంద్రబాబు మాట్లాడారని అన్నారు. అంతే తప్ప తెలంగాణ ప్రాజెక్టులను ఆపాలనే ప్రయత్నం చంద్రబాబుది కాదన్నారు. గతంలో సీతమ్మ బ్యారేజీ పనులను అడ్డుకోలే దన్నారు. సీతారాం సాగర్ లిఫ్టును కూడా తాము వ్యతిరేకించ లేదన్నారు. గోదావరి నుంచి ఇతర రివర్ బేసిన్ లకు నీటిని తరలించే హక్కు చట్టం ప్రకారం తమకు ఉందన్నారు. ఆ చట్టం ప్రకారమే తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారని, ఏపీలోనూ తాము బనకచర్ల ప్రాజెక్టును చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

## 3 ఎకరాల వరకు రైతు భరోసా

- రాష్ట్రంలో 3 ఎకరాల వరకు భూమి ఉన్న వారికి రైతు భరోసా నిధుల జమ..
- ఈ రోజు 1,551.89 కోట్ల రూపాయలను విడుదల చేసిన రాష్ట్ర సర్కార్..
- ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన వారందరికి రైతు భరోసా నిధులు: మంత్రి తుమ్మల

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రంలో మూడు ఎకరాల వరకు భూమి ఉన్న అన్నదాతలకు రైతు భరోసా నిధులను ప్రభుత్వం జమ చేసింది. ఈ రోజు 1,551.89 కోట్ల రూపాయలను విడుదల అయ్యాయి. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ రోజు (జూన్ 17న) 3 ఎకరాల వరకు భూమిని కలిగి ఉన్న రైతులందరి ఖాతాలలోకి ఎకరానికి 6 వేల చొప్పున రైతు భరోసా నిధుల జమ చేయడం జరిగిందని వెల్లడించారు.అయితే, అందుకోసం 1551.89 కోట్ల రూపాయలను విడుదల చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 10.45 లక్షల మంది రైతులకు సంబంధించిన 25.86 లక్షల ఎకరాలకు రైతు భరోసా నిధులు జమ చేశాం అన్నారు. ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన వారందరికి రైతు భరోసా నిధులు జమ చేస్తామని ప్రకటించారు.

## కుల గణన చేయడానికి ఆలోచిస్తున్నారు!

- కుల గణనపై రాహుల్ గాంధీ ఎప్పుడో మాట్లాడారు..
- మోడీ బీసీ అయ్యుండి కూడా కుల గణన చేయడానికి ఆలోచి స్తున్నారు..
- రాష్ట్రంలోని బీసీ ఎంపీలు నోరు విప్పాలి.. లేకపోతే మీ ఇళ్ల ముందు ధర్నా చేస్తా: వి. హనుమంతరావు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** కుల గణనపై ఎవరు మాట్లాడనప్పుడే రాహుల్ గాంధీ మాట్లాడారు అని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు పేర్కొన్నారు. ఎవరు ఎంతో, వారికి అంత అని చెప్పారు.. ఇప్పటి వరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని మూడు సార్లు కలిసి బీసీలకి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఇవ్వు అని కోరినా ఇవ్వలేదు.. జన గణనతో మాకు వచ్చే లాభం లేదు అని తేల్చి చెప్పారు. కుల గణన చేస్తే మాకు మంచిది.. రాహుల్ గాంధీ అగ్రకులంలో పుట్టినా బీసీలకు న్యాయం చేయాలని మాట్లాడారు.. మోడీ బీసీ అయినా, కుల గణన చేయడానికి ఆలోచిస్తున్నాడు అని ఎద్దేవా చేశారు. జన గణనతోనే కుల గణన చేయాలి అని వి. హనుమంతరావు డిమాండ్ చేశారు.ఇక, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖతో పాటు కుల గణన చేయాలని వీహెచ్ కోరారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఎంపీలు నోరు విప్పాలి.. లేదంటే, ఎంపీల ఇంటి ముందు ధర్నా చేస్తాను అని హెచ్చరించారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కులగణన సర్వే బీసీలకు న్యాయం చేసింది.. అలాగే, కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేపట్టి బీసీలకు రావాల్సిన న్యాయమైన వాటాను అందజే యాలని అన్నారు.

## అభివృద్ధి చేసి చూపిస్తాం..!

- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం..
- ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను త్వరలోనే అమలు చేస్తామని వెల్లడి..
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతాం.. అభివృద్ధి చేసి చూపిస్తాం: మంత్రి శ్రీధర్ బాబు



**భూపాలపల్లి ,ఫ్లాష్ ఇండియా :** భూపాలపల్లిలో పలు అభివృద్ధి కార్యాక్రమాల్లో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. జిల్లాలోని గోరికొత్త పల్లి మండలం చెన్నాపూర్ లో కోటి 40 లక్షలతో సబ్ స్టేషన్ ప్రారంభం చేసుకున్నామన్నారు. విద్యుత్ కు అంతరాయం కలగకుండా రూ.8 కోట్ల వ్యయంతో 33/11 కేవీతో మంజూరు నగర్, ధర్మారావు పేట, నవాబుపేటలలో విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని వెల్లడించారు. అలాగే, దీర్ఘకాలికంగా సమస్య లేకుండా ప్రణాళికలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంట్ ఉండదన్నారు, అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంతరాయం కలగకుండా 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.. 6 హామీలలో భాగంగా రాష్ట్రంలో 50 లక్షల మందికి 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని తేల్చి చెప్పారు. జిల్లాలో 47 వేల కుటుంబాలకు 200 యూనిట్ల విద్యుత్ ఇస్తున్నాం.. 46 వేల వ్యవసాయ కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లకు ఉచిత కరెంటు ఇస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు.ఇక, సౌర శక్తి ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు మహిళా సంఘాలకు ఇవ్వడానికి సీఎం, డిప్యూటీ సీఎంతో కలిసి ప్రణాళికలు రచిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. పాఠశాలకు ఉచిత కరెంట్ ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నాం.. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బంది ఉన్నప్పటికీ, 7 లక్షల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమ పథంలో తీసుకెళ్తున్నామన్నారు. బీఆర్ఎస్ వాళ్ళు ఉచిత బస్ ప్రయాణం ఎందుకు ఇస్తున్నారు అని విమర్శిస్తున్నారు.. ఎందుకు ఇస్తున్నామో మహిళలను అడగండి అని సూచించారు. ఇక, గోదావరి నది జలాల కొరకు మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం ప్రాజెక్టులను నిర్మించామని గొప్పలు చెప్పే వాళ్ళు ఈ ప్రాంతానికి ఒక చుక్క నీరు ఇవ్వకుండా తరలించుకెళ్లారని మండిపడ్డారు. గోదావరి నది జలాలకు సంబంధించి ఎగువన ఉన్న మహారాష్ట్ర, దిగువన ఉన్న ఆంధ్ర వాళ్ళు తెలంగాణ రాష్టానికి నీరు ఇచ్చిన తర్వాతే మీరు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ట్రిబ్యునల్ ముందు మా రాష్ట్రానికి నీరు ఇచ్చిన తర్వాతే పక్కా రాష్ట్రాలకు నీటిని తరలించాలని అప్పుడే చెప్పామని శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు.అలాగే, మా ప్రభుత్వం వచ్చిన తర్వాత సన్న బియ్యం ఇస్తామని చెప్పాం.. ఇస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నిలబె ట్టుకుంటాం.. కొంచం సమయం పట్టొచ్చు కానీ చేసి చూపిస్తాం.. ఇక, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతాం.. అభివృద్ధి చేసి చూపిస్తామని వెల్లడించారు. కొత్త జిల్లాలో కొత్త మండలాలకు విద్యుత్ ఏఈ కార్యాలయాలు మంజూరు చేశారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి నా కృతజ్ఞతలు.. దీంతో పాటు ఇల్లు లేని నిరుపేదలకే ఇవ్వాలని కలెక్టర్ లకు చెప్పాం.. ఇందిరమ్మ ఇండ్లు ఎక్కువగా అవసరం ఉన్న కూడా కలెక్టర్ చూసి కేటాయిస్తుంది.. వచ్చే విడతలో తప్పకుండా ఇల్లు లేని పేదల అందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామని దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చెప్పారు.

## ఐదేళ్లలో రైతుల కోసం..

- మా ప్రభుత్వ హయంలో రైతులకు ఉచిత కరెంట్ ఇస్తున్నాం..
- రూ. 500 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నాం..
- అర్హులైన రైతులందరికీ రైతు భరోసా డబ్బులు పడతాయి: డిప్యూటీ సీఎం భట్టి



**భూపాలపల్లి ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెల్లోనే రూ. 21 వేల కోట్లు రుణమాఫీ కింద రైతుల ఖాతాల్లో నిధులు జమ చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని 1.49 కోట్ల ఎకరాలకు రైతుభరోసా నగదు బదిలీ చేసే కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి నిన్న ప్రారంభించారని 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాలో వేసిన చరిత్ర ఈ దేశంలోని మిగతా ఏ రాష్ట్రంలో జర గలేదని కేవలం తెలంగాణ ప్రభుత్వంలోనే జరు గుతోందన్నారు. భూపాలపల్లి ( జిల్లాలో మరో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇవాళ వేయాల్సిన రైతు భరోసా నిధులను ఇందాకే రైతుల ఖాతాల్లో జమ చేశామని ఏడాది కాలంలో రైతుల కోసం రూ. 70 వేల కోట్లు రైతుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టిందన్నారు. ఐదేళ్లలో రూ. 3 లక్షల 50 వేల కోట్లు రైతుల కోసం ఖర్చుచేయబోతున్నామన్నారు. భూమిలేని వ్యవసాయ కూలీల కోసం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కిందా ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ. 12 వేలు అందజే స్తోందన్నారు. రైతుల కోసం ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ప్రజలు గమనించాలన్నారు. ఇప్పటికే రేషన్ కార్డులున్న 90 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. గత పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఇళ్లు కూడా ఇవ్వలేదని మేము అధికారంలోకి వచ్చాక ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తోందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంట్ ఉండదని గత ప్రభుత్వ నేతలు దుష్ప్రచారం చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కానీ మేము అధికారంలోకి వచ్చాక ఎంత డిమాండ్ ఉన్నప్పటికీ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేశామన్నారు. ఈ ఏడాది మార్చిలో గరిష్ఠంగా 17,162 మెగా వాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడిందని నిరంతరాయ విద్యుత్ సరఫరాకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదులు తెలిపారు. 29 లక్షల పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు.సమస్యలు ఉన్నవారు రాజధాని వరకు రాలేరు. ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించే వాళ్లు ఉండటం గొప్ప విషయం అన్నారు.

## జూబ్లీహిల్స్ బై పోల్ పై సీఈవో




**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మరణంతో ఖాళీ అయిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం స్థానంలో ఉప ఎన్నిక నిర్వహణపై తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు రాష్ట్ర అసెంబ్లీ నుంచి తమకు గెజిట్ అందిందని ఆ గెజిట్ ను తాము యథాతథంగా కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించామని చెప్పారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. రెండు మూడు రాష్ట్రాల్లో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇప్పటికే వచ్చిందని జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ ఇప్పుడే రాకపోవచ్చని చెప్పారు. జూబ్లీహిల్స్ స్థానానికి డిసెంబర్ వరకు కొత్త ఎమ్మెల్యే ఎన్నికల జరగాల్సి ఉందన్నారు.

**ఈ నెల 26,27 న శిక్షణ:**

పోలింగ్ స్టేషన్లలలో మినిమం ఓటర్ల సంఖ్యను 1200 కు కుదించినట్లు సుదర్శన్ రెడ్డి గుర్తు చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద ఆంక్షలను 200 మీటర్ల నుంచి కిలో మీటర్ వరకు పెంచినట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రానికి కిలోమీటర్ వరకు పార్టీలు ప్రచారం చేయడానికి వీలు లేదని పోలింగ్ సెంటర్స్ వద్ద ఇకపై మొబైల్ ఫోన్స్ కోసం డిపాజిట్ ఫెసిటిలిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ నెల 26,27 తేదీల్లో తెలంగాణకు చెందిన బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్ఓ), బూత్ లెవల్ ఏజెంట్స్ (బీఎల్ఏ) లకు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ట్రైనింగ్ ఇస్తోందని వివరించారు. నేషనల్ లెవల్ లీగల్ కాన్ఫరెన్స్ కోసం ముగ్గురు న్యాయవాదులకు శిక్షణ ఇస్తున్నదని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో 87 శాతం, అర్బన్ ప్రాంతంలో 67 శాతం ఓటర్ కార్డుకు ఆధార్ కార్డు లింక్ జరిగిందని వివరించారు.

# సంపాదకీయం

## ట్రంప్ దౌత్య రాజకీయం

అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత వ్యవహారాలలో ప్రమేయం పెట్టుకోకుండా దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరుకుంటున్నారు. అయితే ట్రంప్ మహాశయుడు మోదీ అభీష్టాన్ని నెరవేరుస్తారా? నెరవేర్చరు, సందేహం లేదు. ఏప్రిల్ 22, 2025న పహల్గాంలో ఉగ్రవాద దాడితో ప్రారంభమైన ఇండియా–పాకిస్థాన్ సంఘర్షణలో అమెరికా ప్రమేయం పెట్టుకుని తీరాలని డోనాల్డ్ ట్రంప్ విశ్వసిస్తున్నారు. ఈ ఘర్షణపై తాను మాట్లాడిన ప్రతిసారీ, ట్వీట్ చేసిన ప్రతిసారీ తానూ భాగస్తుడినని మరీ మరీ స్పష్టం చేస్తున్నారు. ట్రంప్ అత్యుత్సాహానికి మౌనమే ఇంతవరకూ మోదీ ప్రతిస్పందన. సెప్టెంబర్ 2019లో హ్యూస్టన్ లో 'అబ్కీ బార్ , ట్రంప్ సర్కార్ ' అని పిలుపు ఇచ్చినందుకు మోదీ ఇప్పుడు కలవరపడుతూ ఉండవచ్చని నేను అనుమానిస్తున్నాను. ఏప్రిల్ 22న, ఇతర ప్రపంచ నాయకుల వలే ట్రంప్ కూడా పహల్గాం ఘాతుకంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ ఘటనను తీవ్రంగా ఖండించారు. మే 7న పాకిస్థాన్ లో ఎంపిక చేసిన లక్ష్యాలపై భారత్ మిస్సైళ్ల, డ్రోన్ ల దాడి ప్రారంభించింది. పూర్తి స్థాయి యుద్ధానికి దిగే ఉద్దేశం తమకు లేదని ఇండియా స్పష్టం చేసింది. భారత్ పాకిస్థాన్ ల మధ్య సాయుధ ఘర్షణ శీఘ్రగతిన ముగుస్తుందని ఆశిస్తున్నానని ట్రంప్ ట్వీట్ చేశారు. ఆ మరుసటి రోజు 'తాను ఏమైనా సహాయం చేయగలుగుతానని భావిస్తే అక్కడ ఉంటాను' అని ఆయన అన్నారు. మే 8/9 రాత్రి ఆయన వైఖరిలో ఏదో మార్పు చోటుచేసుకున్నది. చైనా ఉత్పత్తి చేసిన యుద్ధ విమానాలు, మిస్సైళ్లు, టర్కీలో తయారైన డ్రోన్స్ ను పాకిస్థాన్ ఉపయోగిస్తున్న విషయం తెలియడం వల్లే ఆ మార్పు సంభవించి ఉంటుందని నేను భావిస్తున్నాను.పాకిస్థాన్ ప్రయోగించిన మిస్సైళ్లు, డ్రోన్‌లు అన్నిటినీ కూల్చివేసినట్టు మన సీనియర్ సైనికాధికారులు ధ్రువీకరించారు. రెండు రోజుల అనంతరం భారత్‌కు కొంత 'నష్టం' సంభవించినట్టు అధికారికంగా అంగీకరించారు. యుద్ధంలో రెండుపక్షాలకు నష్టం వాటిల్లడం సహజమే కదా. జరిగిన నష్టానికి ఇండియా ఏమీ ఆందోళన చెందలేదు. భారత ప్రజలూ కలవరపడలేదు. మే 10న ట్రంప్ తన వ్యక్తిగత సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్ సోషల్'లో చేసిన ట్వీట్‌తో కలవరం మొదలయింది. ఆ రోజు సాయంత్రం 5.25 గంటలకు ట్రంప్ తన ట్వీట్‌లో అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా జరిగిన చర్చల గురించి ప్రస్తావిస్తూ భారత్, పాకిస్థాన్‌లు తక్షణమే, పూర్తి స్థాయిలో కాల్పుల విరమణ పాటించేందుకు అంగీకరించాయని ప్రకటించేందుకు సంతోషిస్తున్నానని పేర్కొన్నారు. ఇరు దేశాలను అభినందించారు. కొద్ది నిమిషాల అనంతరం అమెరికా విదేశాంగ కార్యదర్శి ఒక 'తటస్థ' ప్రదేశంలో చర్చలకు భారత్, పాకిస్థాన్‌లు సమావేశమవనున్నాయని ట్వీట్ చేశారు. అంతకు ముందు రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు వ్యాన్స్ మోదీతో టెలిఫోన్‌లో జరిపిన సంభాషణల్లో ఆందోళనకరమైన గూఢచార సమాచారాన్ని తెలియజేసినట్టు మీడియాలో వార్తలు వెలువడ్డాయి.ఈ ట్వీట్‌లు అన్నీ ఆసక్తికరంగానూ, దిగ్భ్రాంతికరంగాను ఉన్నాయి. మే 10 మధ్యాహ్నం 3.35 గంటలకు భారత్, పాకిస్థాన్ డీజీఎమ్ఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్)ల మధ్య చర్చలు జరిగాయని, సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ పాటించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని అదే రోజు సాయంత్రం 6 గంటలకు భారత విదేశాంగ శాఖ కార్యదర్శి ధ్రువీకరించారు. మే 12న 'అణు యుద్ధ' ప్రమాదాన్ని నివారించామని ట్రంప్ పేర్కొన్నారు. 'ఆ భయంకర యుద్ధానికి పాల్పడవద్దు. మీరు సంయమనంతో వ్యవహరిస్తేనే మీతో మేము వాణిజ్యం చేస్తామ'ని ఆయన అన్నారు. 'మీరు గనుక యుద్ధాన్ని ఆపకపోతే మేము ఎటువంటి వాణిజ్యమూ చేయం' అని ఆయన పేర్కొన్నారు. (సౌదీ అరేబియా, ఖతర్ పర్యటనలలో కూడా అధ్యక్షుడు ట్రంప్ తన ప్రకటనలను పునరుద్ఘాటించారు). మే 13న 'కొత్త సాధారణ పరిస్థితి' గురించి మోదీ ప్రస్తావించారు. 'అణు బ్లాక్ మెయిల్'కు తాము భయపడమని, తలొగ్గమని స్పష్టం చేశారు. కొన్ని సహేతుకమైన ప్రశ్నలు: మూడు అంశాల సూత్రంలో 'కొత్త' విషయమేమీ లేదు.ఉగ్రవాద దాడికి దీటుగా ప్రతిస్పందించడం; అణు బ్లాక్‌మెయిల్‌ను సహించకపోవడం; రాజ్య ఉగ్రవాదం, ఉగ్రదాడుల వ్యూహప్రజ్ఞాధురీణుల మధ్య వ్యత్యాసాన్ని పాటించకపోవడం. ఈ సువ్యవస్థిత సిద్ధాంతాన్నే కదా మోదీ పునరుద్ఘాటించింది? (2) ఉపాధ్యక్షుడు వ్యాన్స్, విదేశాంగ కార్యదర్శి రూబియో మే 8, 9న కాల్పుల విరమణ గురించి మాట్లాడారా? అదే సమయంలో వారు పాకిస్థాన్ నేతలతో కూడా మాట్లాడారా? మాట్లాడి ఉన్నట్టయితే అది మధ్యవర్తిత్వం కిందకు వస్తుంది కదా. (3) మే 9న మోదీతో 'ఆందోళనకరమైన గూఢచార సమాచారాన్ని' ఉపాధ్యక్షుడు వ్యాన్స్ పంచుకున్నారా? అణ్వస్త్రాలను ప్రయోగిస్తామన్న పాకిస్థాన్ బెదిరింపునకు సంబంధించినదేనా ఆ సమాచారం? కానట్టయితే ప్రధానమంత్రి (మే 12), రక్షణ మంత్రి (మే 15) అణు బ్లాక్‌మెయిల్ గురించి ఎందుకు ప్రస్తావించారు? (4) మే 10న మధ్యాహ్నం 3.35 గంటలకు భారత్, పాకిస్థాన్‌ల డీజీఎమ్‌ఓలు కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చినట్టు ట్రంప్‌కు ఎలా తెలిసింది? ఆ విషయాన్ని అదే రోజు సాయంత్రం 5.25 గంటలకు తన ట్వీట్‌లో ఆయన ఎలా ప్రకటించారు? (5) ట్రంప్ ఏప్రిల్ 2న సుంకాల సమరాన్ని ప్రారంభించిన తరువాత భారత్ మారు ప్రతిపాదనలు పంపలేదా? ఉపాధ్యక్షుడు వ్యాన్స్ తన ఇండియా పర్యటనలో మోదీతో జరిపిన సంభాషణల్లో 'వాణిజ్య ఒప్పందం' విషయాన్ని ప్రస్తావించిందా? (6) భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం చేశామని, వాణిజ్యం అంశాన్ని ఉపయోగించుకుని కాల్పుల విరమణ పాటించేలా బలవంతం చేశామని ట్రంప్ పదే పదే చెప్పుతుండడంపట్ల అమెరికాకు ఇండియా నిరసన తెలిపిందా? పాకిస్థాన్‌కు ఐఎమ్ఎఫ్ రుణం మంజూరుకు సంబంధించిన సమావేశానికి ఇండియా ఎందుకు గైర్హాజరయింది? ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎందుకు ఓటు వేయలేదు? ఇంకా వివిధ ప్రశ్నలు ఉన్నాయి. అయితే వాటిని ప్రస్తావించేందుకు తగిన సమయం ఆసన్నమవలేదు. డోనాల్డ్ ట్రంప్ ఎవరికీ లొంగే వ్యక్తి కాదు. భారత్, పాకిస్థాన్ ఘర్షణ వ్యవహారాలకు ఆయన దూరంగా ఉండరు, ఉండబోరు. ఇబ్బంది కలిగించే ప్రకటనలు చేస్తూనే ఉంటారు. ఇంకా అనేక ప్రశ్నలకు ఆస్కారమిచ్చే విపుల సమాచారాన్ని ఆయన తప్పకుండా ఇస్తారు. అది లేవనెత్తే ప్రశ్నలు అన్నిటికీ మనకు సమాధానాలు లభిస్తాయా? లేక మౌనమే సమాధానమా?



## నాలుగోసారి గెలుపు ఖాయమేనా..?

ప్రధానిగా పదకొండేళ్లు పూర్తిచేసుకున్న మోడీ.. మరోసారి గెలుపు దిశగా ఆలోచనలు చేస్తున్నారు. ఇప్పటికే వరుసగా మూడుసార్లు కేంద్రంలో అధికారం దక్కించుకున్న బీజేపీ.. నాలుగోసారి పవర్లోకి రావాలని ఉవ్విళ్లూరుతోంది. మన దేశంలో నాలుగోసారి వరుస గెలుపు అంత తేలిక కాదనే వాదన ఉన్నా.. మోడీకి, బీజేపీకి కొన్ని సానకూలతలు లేక పోలేదనే చర్చ జరుగుతోంది. అదే సమయంలో ప్రతికూలతల సంగతేంటనే ప్రశ్నలూ లేకపోలేదు. మరి పొలిటికల్ బాహుబలిగా ఎదిగిన మోడీ.. తన ఛరిష్మాను మరో నాలుగేళ్లు నిలబెట్టుకుంటారా..? ప్రజల్ని మరోసారి ఆకట్టుకోవటానికి ఆయన దగ్గరున్న అస్త్రాలేంటి.. అసలు ఇప్పటిదాకా మోడీని తిరుగులేని నేతను చేసిన అంశాలేంటి..? ఇదే అంశంపై ఇవాల్టి ఛైర్మన్స్ డెస్క్ చూద్దాం.తొలి విడతలో కొత్తకొత్తగా సాగిన మోడీ ప్రయాణం.. రెండో విడతకు వచ్చేసరికి పూర్తిస్థాయి సాధికారతను సొంతం చేసుకుంది. 2014లో బీజేపీకి సింగి ల్ గా 282 సీట్లు వస్తే.. 2019లో ఏకంగా 303 సీట్లు రావడం.. మోడీ ఛరిష్మాను పార్టీలో, దేశంలో మరింత పెంచింది. గతంలో కంటే పెరిగిన సీట్లతో మోడీలోనూ రెట్టించిన ఉత్సాహం వచ్చింది. దీంతో ఎప్పట్నుంచో ఉన్న అజెండాలో పనులు ఒక్కొక్కటిగా చేసుకుంటూ వెళ్లారు. ఈ ఫలితాలు ఇచ్చిన ఊపులోనే.. మోడీ రెండో విడత తొలి వంద రోజుల్లోనే ఆర్టికల్ 370ని రద్దు చేశారు. దీనికి విపక్షాల నుంచి కూడా అనుకున్నంత వ్యతిరేకత రాలేదు. పైగా వ్యతిరేకించిన కాంగ్రెస్ లోనూ భిన్నస్వరాలు వినిపించడం బీజేపీకి కలిసొచ్చింది. ఇక ఆర్టికల్ 370 రద్దు చేస్తే.. ఏదో జరిగిపోతుందనే ఆందోళనల్ని ఆయన



ఖాతరు చేయలేదు. అందుకు తగ్గట్టుగానే ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఎలాంటి అవాంఛనీయ పరిణామాలు జరగకపోవడం మోడీ ప్రతిష్ఠను బాగా పెంచింది. శ్రీనగర్ లాల్ చౌక్ లో తొలిసారి జాతీయ జెండా ఎగిరిందని, కశ్మీర్ కు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని బీజేపీ విపరీతంగా ప్రచారం చేసింది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్లో ఉగ్ర కార్యకలాపాలు తగ్గుముఖం పట్టినట్టుగా గణాంకాలు చాడటం కూడా మోడీ ఇమేజ్ కు ప్లస్సైంది. ఆ తర్వాత



జమ్ముకశ్మీర్ రాష్ట్ర పునర్వ్యవస్థీరణ క్రతువు కూడా నిరాటంకంగా పూర్తైంది. కశ్మీర్లో గవర్నర్ పాలనపై మొదట్లో విమర్శలు వచ్చినా.. ఆ తర్వాత జరిగిన స్థానిక ఎన్నికల్లో ఓటర్ల ఉత్సాహం అందరికీ ఓ నమ్మకాన్ని తెచ్చింది. గవర్నర్ పాలనలో కశ్మీర్లో వ్యాపార, వాణిజ్యాలు కూడా కాస్త పుంజుకోవడం, జీవనోపాధి మెరుగుపడటం.. స్థానికులకూ కాస్త ఊరట ఇచ్చింది.ఇక ట్రిపుల్ తలాక్ రద్దు అంశం కూడా బీజేపీకి రాజకీయంగా కలిసొస్తున్నట్టు తేలిన దశ కూడా ఇదే. కొన్ని రాష్ట్రాల్లో ముస్లిం మెజార్టీ నియోజకవర్గాల్లోనూ బీజేపీ గెలవడం మిగతా పార్టీల్ని ఆశ్చర్యపరిచింది. ఆ తర్వాత కొన్ని తటస్థ సంస్థల పరిశీలనలో ముస్లింలలోనూ బీజేపీ ఏర్పడ్డ ఓటు బ్యాంకు గురించి అందరికీ తెలిసింది. దీన్ని బీజేపీ ఓటు బ్యాంకు అనడం కంటే మోడీ ఓటు బ్యాంకు అనాలనే వాదన కూడా వినిపించింది. బీజేపీకి ఓటు బ్యాంకు విషయంలో చారిత్రకంగా కొన్ని పరిమితులున్నాయి. కానీ మోడీ ఆ హద్దులన్నీ చెరిపేశారని, దేశవ్యాప్తంగా కుల,మతాలకు అతీతంగా ఆయన ఓట్లు తెచ్చుకోగలుగుతున్నారని ఎన్నికల పండితులు కూడా ఒప్పుకున్న సందర్భమది. అంతగా రెండో విడతలో మోడీ ప్రభ వెలిగిపోయింది. మోడీ ఉచ్ఛ స్థితిలో ఉండగా.. కొన్ని రాష్ట్రాల్లో బీజేపీ ఓటముల్ని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. పైగా ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీకి డిఫాల్ట్ గా ఫేవరెట్ గా భావించే సంస్కృతి మొగ్గతొడిగింది.ఆ తర్వాత ఎన్నికలకు వెళ్లేలోగానే అయోధ్యలో రామమందిర నిర్మాణం తొలిదశ పూర్తి చేశారు మోడీ. ఈ సందర్భాన్ని దేశవ్యాప్తంగా పండగలా చేసుకున్నారు. మోడీ హయాంలో హిందూ మతానికే పూర్వవైభవం వచ్చిందనే స్థాయిలో చర్చ జరిగింది. ఈ దెబ్బతో హిందువుల ఓట్లన్నీ సంఘటితమై.. బీజేపీ మరింత బలపడుతుందనే అంచనాలు వచ్చాయి. అతి పెద్ద రాష్ట్రం యూపీలో బీజేపీ రాజకీయ సుస్థిరతను సాధించడంతో మోడీకి తిరుగులేకుండా పోయింది. రెండో విడతలో దేశమంతా మోడీ షో నడిచిందనే చెప్పాలి.కానీ రెండో విడత పూర్తయ్యే సమయానికి బీజేపీ క్యాడర్లో కనిపించని నిర్లిప్తత ఆవరించింది. పై నుంచి చూస్తే అంతా బాగానే ఉంది. కానీ ఎన్నికలకు కావాల్సింది ఇంకేదో మిస్సైందనే భావన లోలోపల కనిపించింది. ఇదే సమయంలో కొందరు సీఎంల ఎంపిక విషయంలో భిన్నాభిప్రాయాలు వచ్చాయి. అవేవీ రచ్చకెక్కకపోయినా.. అంతర్గతంగా బీజేపీలో కొంత ఇబ్బందిని సృష్టించాయనే చెప్పాలి. దీంతో బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో గ్రూపులు తయారయ్యాయి. ఈ సంగతి పూర్తిస్థాయిలో అధిష్ఠానం దాకా వెళ్లకపోవడం.. ఎన్నికల సన్నద్ధతను కొంత మేర దెబ్బకొట్టిందని తర్వాత తేలింది. మొత్తం మీద ఎదురులేని అధికారంతో రెండో విడత పాలన ప్రారంభించిన మోడీ.. దాన్ని అదే స్థాయిలో పూర్తిచేసుకోలేకపోయారనే చెప్పాలి.. చివరకు వచ్చేసరికి తెలియకుండా ఏర్పడ్డ బలహీనతలు.. 2024 ఎన్నికల్లో బీజేపీకి నష్టం చేశాయి. తిరుగులేదనుకున్న యూపీలో 30 సీట్లు పోవడం.. చిన్న విషయం కానే కాదు. అలాగే బలమైన ఉత్తరాది రాష్ట్రాల్లో కొన్నిచోట్ల బీజేపీని సొంత పార్టీలో గ్రూపులే ఓడించాయనే చేదు నిజం ఆలస్యంగా వెలుగుచూసింది. పార్టీకి ప్రతిష్ఠగా నిలిచిన అయోధ్యలో బీజేపీ ఓడిపోవడం మరింత షాక్.నిజానికి బీజేపీలో అంతర్గత బలహీనతలు అప్పటికప్పుడు బయటపడలేదు. కొన్నాళ్ల ముందుగానే సంకేతాలు కనిపించాయి. కానీ అప్పుడు తిరుగులేని అధికారం అనుభవిస్తున్న బీజేపీ.. వాటిని అంత సీరియస్ గా తీసుకోలేదనే వాదన వినిపించింది. తర్వాత ఆ చిన్న విషయాలే పెద్దవయ్యాయి. చివరకు వస్తాయనుకున్న 400 సీట్లు రాకపోగా.. కేవలం 240 సీట్లకే పరిమితం అవ్వాల్సి వచ్చింది. తొలి విడతలో పార్టీ సీఎంలతోనూ తేడా రాకుండా చూసుకున్న మోడీ.. పార్టీలో కూడా సమష్టి నిర్ణయాలు ఉండేలా జాగ్రత్తపడ్డారు. కానీ రెండో విడతకు వచ్చేసరికి.. సీఎంలతో వ్యవహారంలో తేడా వచ్చిందనే కామెంట్లు వచ్చాయి. అలాగే ఏ నిర్ణయమైనా మోడీ, అమిత్ షా మాత్రమే తీసుకుంటున్నారనే భావన బలపడింది. చివరకు గడ్కరీ లాంటి సీనియర్లు కూడా బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం.. పార్టీలో అసలేం జరుగుతోందనే ప్రశ్నల్ని క్యాడర్లో రేకెత్తించింది. చివరకు ఆరెస్సెస్ తోనూ అంటీముట్టనట్టుగా ఉండటం.. సంఘ్ పరివార్ లోనూ అసంతృప్తికి కారణమైంది. అసలు ఆరెస్సెస్ అవసరం బీజేపీకి లేదన్నట్టుగా పార్టీ జాతీయ అధ్యక్షుడు చేసిన కొన్ని వ్యాఖ్యలు కూడా కలకలం రేపాయి. కొన్ని విషయాల్లో మోడీ పాత్ర ఏమీ లేకపోయినా.. ఆయనకు తెలిసే అంతా జరుగుతుందనే ప్రచారం గట్టిగా జరిగింది. ఇది కూడా మోడీ ఇమేజ్ కు నష్టం చేసింది. ఇలా ఒక్కొక్కటిగా మోడీ బలాలు దూరం కావడం.. ఆయన వ్యక్తిగత ఛరిష్మాను కూడా కాస్త దెబ్బతీసింది. ఈ కారణంగానే అనుకున్నన్ని సీట్లు రాలేదనే చర్చ జరిగింది.





## ఎందుకు తికమక పడుతుంది..?

ఎన్నికలు పూర్తయి, పార్టీకి పవర్ పోయి ఏడాది గడిచినా.... ఆ విషయంలో వైసీపీ అధిష్టానం గందరగోళంలోనే ఉందా? ఏం చేయాలి, ఎలా చేయాలన్న విషయంలో ఇప్పటికీ క్లారిటీకి రాలేకపోతోందా? పార్టీ అధ్యక్షుడు జగన్ సత్వర నిర్ణయాలు తీసుకుంటారని పేరున్నా... ఆ ఒక్క సబ్జెక్ట్ లో మాత్రం ఎందుకు జీడిపాకం సీరియల్ ని తలపిస్తోంది? ఏం చేయాలో అర్ధంకానంత.. ఆ పెద్ద సమస్య ఏంటి? పార్టీలో ఎలాంటి చర్చలు జరుగుతున్నాయి?2024 అసెంబ్లీ ఎన్నికల్లో సోషల్ ఇంజనీరింగ్ పేరిట భారీ మార్పులు.. చేర్పులు చేసి చేతులు కాల్చుకుంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. 80 అసెంబ్లీ సీట్లతోపాటు పలు లోక్ సభ నియోజకవర్గాల్లో కూడా ఇన్ స్టంట్ కాఫీలాగా... ఇన్ స్టంట్ మార్పులు చేసేసి చివరికి 11 సీట్లకు పరిమితమైంది. అయితే... ఆ స్థాయి దెబ్బ తగిలాక కూడా పార్టీ అధ్యక్షుడు జగన్ త్వరగానే కోలుకున్నారన్నది రాజకీయ వర్గాల అభిప్రాయం. ద్వితీయ శ్రేణితో కూడా మీటింగ్ లు, వరుస సమీక్షలు, మళ్ళీ పాదయాత్ర సంకేతాల్లాంటివి ఇందులో భాగమేనంటున్నారు. అటు సంస్థాగతంగా కూడా పార్టీలో పూర్తి స్థాయి ప్రక్షాళన మొదలైంది. అత్యంత కీలకమైన పీఏసీలోనూ సమూల మార్పులు తీసుకువచ్చారు జగన్ . పార్టీలోని దాదాపు పదవులన్నిటినీ ఫిల్ చేసినా.... నియోజకవర్గాలు మార్చిన చోట ఏం చేయాలా అన్న విషయంలో మీమాంస కొనసాగుతోందట. అందర్నీ తిరిగి పాత సెగ్మెంట్స్ కు పంపాలా? వద్దా? అన్న దగ్గర ప్రక్రియ ఆగినట్టు చెప్పుకుంటున్నాయి పార్టీ శ్రేణులు.గత అసెంబ్లీ ఎన్నికల్లో... 80 నియోజకవర్గాల దాకా అభ్యర్థుల్ని మార్చగా.. అందులో అత్యధికంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే 11 సెగ్మెంట్స్ ఉన్నాయి. ఇలా మార్చిన వాటిలో కొన్ని చోట్ల నాయకులు ఓటమి తర్వాత పార్టీ వదిలేసి వెళ్ళిపోయారు. అలాంటి చోట్ల మాత్రమే... ఇన్చార్జ్ లను నియమించింది అధిష్టానం. ఇక మిగతా నియోజకవర్గాల్లో మాత్రం... నేతలు తాము అక్కడే ఉండిపోవాలా? లేక మారుస్తారా అన్నది అర్ధంగాక అయోమయంలో ఉన్నారట. ఆ గందరదోళంతో కొందరు పూర్తిగా సైలెంట్ అయిపోగా.. మరికొందరు మాత్రం ఏదో... బండి నడుస్తోంది కదా అన్నట్టు నెట్టుకొస్తున్నారట. ఆయా సెగ్మెంట్స్ లో కేడర్ యాక్టివ్ అయినా...



లీడర్స్ మాత్రం వాళ్ళని నడిపించేందుకు మానసికంగా సిద్ధంగా లేనట్టు తెలుస్తోంది. అసలు మార్చిన కొత్త నియోజకవర్గాల్లో కొనసాగేందుకు వాళ్ళు ఇష్టపడటం లేదనేది వైసీపీలో ఓపెన్ టాక్. ఇష్టం లేకున్నా... ఎన్నికల టైంలో పార్టీ నిర్ణయాన్ని కాదనలేక కొత్త చోట్లకు వెళ్ళామని, అక్కడున్న వాళ్ళ సహకారం లేక ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నామన్నది ఎక్కువ మంది మనోగతంగా తెలుస్తోంది.ఆ సహకారలేమి వల్లే చాలా చోట్ల ఫలితాలు తారుమారైనట్టు చెప్పుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో... ఎన్నికలు పూర్తయి ఏడాది గడిచినా నియోజకవర్గాలు మారిన నేతల సంగతి ఎటు తేల్చక పోవటంతో... అదే అయోమయం కొనసాగుతోందని అంటున్నారు. అలాగే కొత్త నియోజకవర్గాల మీద ఆసక్తి లేక ప్రస్తుతం పార్టీ పిలుపునిస్తున్న కార్యక్రమాల్లో సైతం సరిగా పాల్గొనడం లేదట. హై కమాండ్ చెప్పింది కాబట్టి ఆ రోజున ప్రోగ్రామ్ లో కనిపించి మమ అని వస్తున్నట్టు సమాచారం. దీనివల్ల నష్టం జరుగుతోందని, పాత నియోజకవర్గాలకు మార్పు విషయంలో పార్టీ అధిష్టానం ఓ నిర్ణయం తీసుకుని ప్రకటన చేస్తే... అందరికీ బాగుంటుంది కదా అని కేడర్ లోనే చర్చ జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఆ స్పష్టత ఉంటేనే... వచ్చే ఎన్నికల్లో పోటీ విషయంలో వాళ్ళు ఇప్పటి నుంచే జాగ్రత్తగా ఉంటారని, కేడర్ ని సెట్ చేసుకుంటారని అభిప్రాయ పడుతున్నారు పార్టీ నాయకులు. అలాంటి వాళ్ళంతా.. పార్టీ అధినేత జగన్ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది.అటు ఈ విషయంలో హై కమాండ్ కూడా కసరత్తు చేస్తున్నట్టు సంకేతాలందుతున్నాయి. అన్ని నియోజకవర్గాల నుంచి నివేదికలు తెప్పించుకోవడంతోపాటు.... మార్పులు చేసిన చోట్ల గెలిచిన నేతలను సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా అక్కడే కొనసాగించాలనుకుంటున్నట్టు సమాచారం. కానీ... అక్కడే పీటముడి పడుతోందట. మార్చిన సిట్టింగ్ లను కొనసాగిస్తే....అక్కడున్న మాజీ ఎమ్మెల్యేలను ఎక్కడకు రీప్లేస్ చేయాలన్న విషయంలో తర్జనభర్జన పడుతున్నట్టు సమాచారం. ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల సమయం ఉన్నందున ఆచితూచి అడుగులు వేయాలని పార్టీ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. కాస్త టైం తీసుకుంటే... కొత్త చేరికలు, సామాజిక లెక్కల్లాంటి వాటన్నిటినీ సెట్ చేసుకోవచ్చని అనుకుంటున్నారట. దీంతో ఈ విషయంలో జగన్ లెక్కలేంటి? కొత్త వాళ్ళని, పాత వాళ్ళని ఎలా సెట్ చేస్తారోనని ఆసక్తిగా గమనిస్తున్నాయి రాజకీయ వర్గాలు.

# రెడ్ జోన్ పరిధిలోకి ఆర్కే బీచ్ ఏరియా



- జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం
- యోగాంధ్ర 2025 కోసం ఏపీ ప్రభుత్వం ఏర్పాట్లు
- ప్రధాన వేదికగా ఆర్కే బీచ్ ఎంపిక
- రెడ్ జోన్ పరిధిలోకి ఆర్కే బీచ్ ఏరియా

**ఆంధ్రప్రదేశ్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ ఏరియా తాత్కాలిక రెడ్ జోన్ పరిధిలోకి వచ్చింది. నేటి నుంచి 96 గంటల పాటు ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. నావల్ కోస్ట్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకు ఆంక్షలు కొనసాగుతాయని వైజాగ్ సిటీ పోలీసు కమిషనర్ తెలిపారు. 5 కిలో మీటర్ల పరిధిలో ప్రైవేట్ డ్రోన్ లను ఎగురవేయడం, నిరసనలు, ర్యాలీలు చేపట్టడం లాంటి కార్యక్రమాలను నిషేధిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. జూన్ 17 ఉదయం 10 గంటల నుంచి జూన్ 21 ఉదయం 10 గంటల వరకు నాలుగు రోజుల పాటు బీచ్ ఏరియా రెడ్ జోన్ పరిధిలో ఉంటుంది.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న ప్రధాని నరేంద్ర మోడీ విశాఖకు రానున్నారు. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, గవర్నర్ అబ్దుల్ నజీర్ వంటి ప్రముఖులు అంతర్జాతీయ యోగాడేలో పాల్గొనున్నారు. యోగాంధ్ర 2025 కోసం ప్రధాన వేదికగా ఆర్కే బీచ్ ను ఎంపిక చేశారు. లక్షల మంది వేడుకల్లో పాల్గొననున్నారు. యోగా దినోత్సవం రోజు ఉదయం 5:30 గంటల నుంచి ప్రజలకు వేదిక వద్దకు అనుమతి ఉంటుంది. ప్రధాని మోడీ ఉదయం 6:30 గంటల నుంచి 7:30 గంటల వరకు యోగా కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రధాని ప్రసంగం అనంతరం కార్యక్రమం ముగుస్తుంది.అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ఏపీ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. గిన్నీస్ బుక్ సహా 22 రికార్డుల్లో నమోదు అయ్యేలా భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు యోగాభ్యాసంలో 3.5 లక్షల మందిపాల్గొననున్నారు. మొత్తం 5 లక్షల మందితో ఇంటర్నేషనల్ యోగా డే జరగనుంది. ప్రధాన మంత్రి సమక్షంలో విశాఖ యోగా డే డిక్లరేషన్ ఏపీ ప్రభుత్వం ప్రకటించనుంది. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా యోగాను నిరంతర ప్రక్రియగా ప్రమోట్ చేయాలని నిర్ణయం తీసుకుంది.

# సిట్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు



- ఏపీ ప్రభుత్వానికి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సంచలన లేఖ
- చెవిరెడ్డిని ఇరికించేందకు సిట్ అధికారులు ప్రయత్నిస్తున్నారు
- తాము చెప్పినట్టు రాసి సంతకం చేయమని సిట్ అధికారుల ఒత్తిడి
- ఇకపై ఒంటరిగా సిట్ విచారణకు హాజరుకాలేను

**ఆంధ్రప్రదేశ్ :** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. లిక్కర్ స్కామ్ లో వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఇరికించేందకు సిట్ అధికారులు ప్రయత్నిస్తున్నారని తిరుపతి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేస్తూ.. ఏపీ ప్రభుత్వానికి లేఖ రాశారు. లిక్కర్ స్కామ్ కేసులో తాము చెప్పినట్టు రాసి సంతకం చేయమని సిట్ అధికారులు తనపై ఒత్తిడి తెచ్చారని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకి రాసిన లేఖలో మదన్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపై ఒంటరిగా సిట్ విచారణకు హాజరుకాలేనని స్పష్టం చేశారు.'పదేళ్ల పాటు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వద్ద గన్ మెన్ గా పనిచేశా. లిక్కర్ స్కామ్ కేసులో నేను చెప్పినట్లు రాసి సంతకం చేయమని సిట్ అధికారులు ఒత్తిడి చేశారు. నా కంటే ముందు విచారణకు హాజరైన గిరి కూడా తాము చెప్పినట్లే విన్నాడని అధికారులు చెప్పారు. విచారణకు యూనిఫామ్ లో వెళ్లనందుకు నన్ను తిట్టారు. చెవిరెడ్డికి లిక్కర్ కేసులో సంబంధం ఉందని నన్ను చెప్పామన్నారు. తప్పుడు స్టేట్ మెంట్ ఇవ్వనందుకు నాపై సిట్ అధికారులు దాడులు చేశారు. ఇకపై ఒంటరిగా సిట్ విచారణకు హాజరుకాలేను' అని ఏపీ ప్రభుత్వానికి రాసిన లేఖలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్ రెడ్డి పేర్కొన్నారు.ఏపీ హైకోర్టులో తిరుపతి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. లిక్కర్ స్కామ్ కేసులో విచారణ పేరుతో సిట్ అధికారులు బలవంతంగా వాంగ్మూలాలు సేకరించేందుకు ప్రయత్నం చేస్తున్నారని పిటిషన్ వేశారు. సిట్ అధికారులు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని, విచారణ పారదర్శకంగా జరిగేలా ఆదేశించాలని పిటిషన్ లో అభ్యర్థించారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్ రెడ్డి పిటిషన్ పై నేడు హైకోర్టు విచారణ చేపట్టనుంది. ఇక సిట్ అధికారుల దాడుల వల్ల మదన్ ఆరు రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉన్నారు.

# ఆర్థిక సహాయాన్ని అందించిన మంత్రి సవిత!



- భారత్-పాకిస్తాన్ యుద్ధంలో మురళీ నాయక్ వీర మరణం
- మురళీ తల్లిదండ్రులకి ఆర్థిక సహాయాన్ని అందించిన మంత్రి సవిత
- ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ

**ఆంధ్రప్రదేశ్ :** భారత్-పాకిస్తాన్ యుద్ధంలో వీర మరణం పొందిన తెలుగు జవాన్ మురళీ నాయక్ తల్లిదండ్రులకి ఏపీ ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని మంత్రి సవిత అందించారు. మురళీ తల్లిదండ్రులకు రూ.50 లక్షల రూపాయల చెక్కు ప్రభుత్వం తరఫున అందజేశారు. అంతకుముందు మురళీ నాయక్ చిత్రపటానికి మంత్రి సవిత నివాళి అర్పించారు. మురళీ నాయక్ తల్లిదండ్రులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.మురళీ నాయక్ తల్లిదండ్రులకి చెక్కును అందించిన అనంతరం మంత్రి సవిత మీడియాతో మాట్లాడారు. 'ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.50 లక్షల చెక్, 5 ఎకరాల పొలం, 6 సెంట్ల స్థలం మురళీ నాయక్ తల్లిదండ్రులకు అందజేశాం. వీర జవాన్ మురళీ నాయక్ సమాధిని 14 లక్షలతో నిర్మించాం. మురళీ ఊరి పేరు కూడా మురళీ నాయక్ తండాగా మార్చే ప్రక్రియ చేపట్టాం. విగ్రహం కూడా ఏర్పాటు చేస్తాం. వీర జవాన్ తల్లిదండ్రులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుంది' అని మంత్రి సవిత హామీ ఇచ్చారు.మే 8న రాత్రి జరిగిన ఎదురుకాల్పుల్లో జమ్మూకశ్మీర్ లో తెలుగు జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందారు. సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గడ్డంతండా పంచాయతీ కల్లితండాలో జవాన్ కు అధికార లాంఛనాలతో ప్రభుత్వం అంత్యక్రియలు నిర్వహించింది. మురళీ నాయక్ కుటుంబానికి అండగా ఉంటామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం నేడు రూ.50 లక్షల చెక్, 5 ఎకరాల పొలం, 6 సెంట్ల స్థలంను మురళీ తల్లిదండ్రులకు అందజేశారు.

# కెనడా చేరుకున్న మోడీ




**ఢిల్లీ :** ప్రధాని మోడీ కెనడా చేరుకున్నారు. కెనడాలోని కాల్గరీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మోడీకి ఘనస్వాగతం లభించింది. ఈరోజు, రేపు కెనడాలో పర్యటించనున్నారు. జీ7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. 2023లో ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన సంబంధాలు తెగిపోయాయి. మళ్లీ ఇన్నాళ్లకు మోడీ కెనడాలో అడుగుపెట్టడం ఇదే తొలిసారి. దీంతో ప్రపంచమంతా సర్వత్రా ఆసక్తిగా చూస్తోంది. ఇక ప్రధాని మోడీ 2019 నుంచి జీ7 సమావేశాలకు హాజరవుతూ వస్తున్నారు.కెనడాలోని ఆల్బెర్టాలోని కననాస్కిస్ గ్రామంలో జరుగుతున్న జీ 7 శిఖరాగ్ర సమావేశంలో మోడీ పాల్గొననున్నారు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ అధికారిక ఆహ్వానం మేరకు 2015 తర్వాత ప్రధాని మోడీ కెనడాలో పర్యటిస్తున్న తొలి పర్యటన ఇది.జీ 7 సదస్సు సోమవారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమ్మిట్ లో యునైటెడ్ స్టేట్స్, ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్ డమ్, ఇటలీ, జర్మనీ, కెనడా, జపాన్, యూరోపియన్ యూనియన్ తో సహా ప్రపంచంలోని అత్యంత అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లోనే కొందరు నాయకులంతా ఒకచోట చేరనున్నారు. ప్రధానంగా ఈ సమ్మిట్ లో ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొంటారు. వాస్తవానికి భారత దేశం జీ7లో సభ్యత్వం లేదు. అయినా కూడా 2019 నుంచి మోడీకి ఆహ్వానాలు అందుతున్నాయి. ప్రస్తుతం కెనడా ఆహ్వానం మేరకు వెళ్లారు. ఇక ఇటీవల భారతదేశం.. పాకిస్థాన్ పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. దీంతో తొలిసారి మోడీ అంతర్జాతీయ పర్యటన చేపట్టడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా ఈ అంశాన్ని ప్రధాని మోడీ లేవనెత్తే అవకాశం ఉంది.

**జీ7 సమ్మిట్ అజెండా**

పశ్చిమాసియాలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం. అలాగే ట్రంప్ విధించిన సుంకాలు. భౌగోళికంగా చోటుచేసుకున్న రాజకీయ ఉద్రిక్తతలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

# ఇరాన్ ఎయిర్‌పోర్టుపై ఇజ్రాయెల్ దాడి



**ఢిల్లీ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరాన్ పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తోంది. టెహ్రాన్ విమానాశ్రయంపై ఇజ్రాయెల్ వైమానిక దళం దాడి చేసింది. ఈ ఘటనలో రెండు ఇరానియన్ ఎఫ్-14 యుద్ధ విమానాలు ధ్వంసం అయ్యాయి. ఈ మేరకు వీడియోను ఐడీఎఫ్ ఎక్స్ ట్విట్టర్ ద్వారా పంచుకుంది.ఈ రెండు జెట్ లు ఇజ్రాయెల్ విమానాలను అడ్డగించడానికి ఇరాన్ ఉపయోగించినట్లు సమాచారం. ఇక ఇరానియన్ డ్రోన్ యూనిట్లు, ప్రసార సౌకర్యాలను కూడా ఐడీఎఫ్ దాడి చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. టెహ్రాన్ లోని ఒక విమానాశ్రయంలో ఇజ్రాయెల్ వైమానిక దళం.. రెండు ఇరానియన్ F-14 ఫైటర్ జెట్ లను ధ్వంసం చేసిందని ఐడీఎఫ్ ప్రతినిధి ఎఫీ డెఫ్రిన్ మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.ఈ రెండు ఫైటర్ జెట్లను 1979 ఇస్లామిక్ విప్లవానికి ముందు అమెరికా డెలివరీ చేసింది. అప్పటి నుంచి ఆ రెండు ఫైటర్ జెట్ లను ఇరాన్ ఇప్పటికీ నిర్వహిస్తోంది. ఈ విమానాలు ఇప్పటికీ క్రియాశీలకంగా పని చేస్తున్నట్లు సమాచారం. ఇక డ్రోన్లు నిల్వ చేసిన కంటైనర్లపైన కూడా ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ వీడియోను కూడా పంచుకుంది. అలాగే టెహ్రాన్ లోని ఇరాన్ రాష్ట్ర ప్రసార భవనంపై జరిగిన దాడి వీడియోను కూడా ఇజ్రాయెల్ సైన్యం పంచుకుంది.ఇదిలా ఉంటే ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీని చంపడం వల్ల రెండు దేశాల మధ్య వివాదం ముగిసిపోతుందని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు అన్నారు. ఇరాన్ పై ఇజ్రాయెల్ కొనసాగుతున్న సైనిక చర్యలను సమర్థించారు. అవి సంఘర్షణను మరింత తీవ్రతరం చేయడం కంటే అంతం చేయడమే లక్ష్యంగా ఉన్నాయని అన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్ ను లక్ష్యంగా చేసుకునే ఇజ్రాయెల్ ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో వీటో చేశారని.. అది సంఘర్షణను మరింత తీవ్రతరం చేస్తుందని భయపడిన తర్వాత నెతన్యాహు ఈ వ్యాఖ్యలు చేశారు.

# జీ7 నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయిన ట్రంప్



- జీ7 నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయిన ట్రంప్
- ఆగమేఘాలపై అమెరికాకు పయనం
- భద్రతా మండలి సమావేశంలో పాల్గొననున్న ట్రంప్

**అమెరికా :** ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి. ఇరు పక్షాలు భీకరంగా దాడులు చేసుకుంటున్నాయి. ఏ క్షణంలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇక కెనడాలో జీ7 శిఖరాగ్ర సదస్సులో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అర్ధాంతరంగా వెళ్లిపోయారు. హుటాహుటిన అమెరికాకు పయనం అయ్యారు. అత్యవసరంగా భద్రతా మండలి సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. వచ్చీరాగానే భద్రతా మండలి సమావేశంలో పాల్గొననున్నట్లు వైట్‌హౌస్ తెలిపింది. ఈ విషయాన్ని వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ వెల్లడించారు. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.జీ7 సదస్సులో ట్రంప్ చర్చలు జరిపారని.. యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో కీలక ఒప్పందం చేసుకున్నట్లు లీవట్ వెల్లడించారు. పశ్చిమాసియాలో చోటుచేసుకున్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో ట్రంప్ అర్ధంతరంగా పర్యటన ముగించుకుని అమెరికాకు బయల్దేరినట్లు లీవిట్ పేర్కొన్నారు. ఇక ట్రంప్ కూడా జీ7 సభ్య దేశాల నేతలతో గ్రూప్ ఫొటో దిగిన తర్వాత అత్యవసరంగా తిరిగి వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ స్పందిస్తూ.. ట్రంప్ వెనుదిరగడం సరైన నిర్ణయమే అని అన్నారు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధాన్ని ముగించాలని జీ7 నేతలు పిలుపునిచ్చారు.ఇదిలా ఉంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. టెహ్రాన్ ప్రజలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే టెహ్రాన్‌ను ఖాళీ చేయాలని ఆదేశించారు. ఇప్పటికైనా ఇరాన్‌కు సమయం మించిపోలేదని.. అమెరికాతో అణు ఒప్పందం చేసుకోవాలని ట్రంప్ సూచించారు. కెనడా వేదికగా జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సమావేశంలో ట్రంప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమెరికాతో ఇరాన్ అణు ఒప్పందాన్ని అంగీకరించాల్సి ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. మరింత సమయం ఆలస్యం కాకముందే ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని.. ఇప్పటికే రెండో అవకాశం ఇచ్చినట్లు సోషల్ మీడియా వేదికగా ట్రంప్ గుర్తుచేశారు.

# ఇజ్రాయెల్‌ను ఖాళీ చేయండి

- ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్తలు
- ఇజ్రాయెల్‌ను ఖాళీ చేయండి పౌరులకు చైనా పిలుపు

**చైనా :** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఏ క్షణంలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం ఇరు దేశాలు భీకర దాడులు చేసుకుంటున్నాయి. ఆస్తి, ప్రాణ నష్టాలు ఎక్కువగా జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలో చైనా అప్రమత్తం అయింది. ఇజ్రాయెల్ నుంచి పౌరులు విడిచివెళ్లాలని ఇజ్రాయెల్ లోని చైనా రాయబార కార్యాలయం కోరింది. చైనా పౌరులంతా జోర్డాన్ వైపు నుంచి ల్యాండ్ క్రాసింగ్ ల ద్వారా వెళ్లాలని నోటీసులో సూచించింది. ప్రస్తుతం ఇజ్రాయెల్ వైమానిక ప్రాంతం మూసివేసిందని.. భద్రతాకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొన్న తరుణంలో భూ సరిహద్దు క్రాసింగ్ ల ద్వారా వెళ్లిపోవాలని కోరింది.ఇరాన్ క్షిపణులు ఇజ్రాయెల్ నివాసితుల మధ్య పడడంతో పౌరులు చనిపోతున్నారు. అలాగే నివాసాలు కూడా దెబ్బతింటున్నాయి. ఇక హైఫా, ఇజ్రాయెల్ అంతటా వైమానిక దాడి సైరన్లు మోగుతున్నాయని ఐడీఎఫ్ తెలిపింది. ఇక క్షిపణులను అడ్డగించడానికి తమ వైమానిక రక్షణ వ్యవస్థలు పనిచేస్తున్నాయని తెలిపింది. పౌరులు ఆశ్రయాల్లోకి ప్రవేశించి తదుపరి నోటీసు వచ్చే వరకు అక్కడే ఉండాలని పిలుపు నిచ్చింది.ఇదిలా ఉంటే ఈ వారంలో అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరిగే అవకాశం ఉందని ఆక్సియోస్ నివేదించింది. అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్- ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి మధ్య సమావేశం జరిగే అవకాశంపై వైట్ హౌస్ ఇరాన్ తో చర్చలు జరుపుతున్నట్లు ఆక్సియోస్ వార్తా సంస్థ తెలిపింది. అణు ఒప్పందం, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధానికి ముగింపుతో కూడిన దౌత్యపరమైన చొరవపై చర్చించనున్నారు.

# అహ్మదాబాద్-లండన్ విమానం రద్దు..



**అహ్మదాబాద్ :** ఎయిరిండియా ఘోర ప్రమాదం జరిగిన కొన్ని రోజుల తర్వాత ''ఆపరేషనల్ సమస్యల'' కారణంగా అహ్మదాబాద్-లండన్ గాట్విక్ మధ్య నడిచే సర్వీస్ – AI 159 -ను రద్దు చేసింది. ఎలాంటి సమాచారం లేకుండా రద్దు చేయడంపై ప్రయాణికులు ఆగ్రహానికి గురయ్యారు. అయితే, చిక్కుకుపోయిన ప్రయాణికులను వేరే మార్గాల్లో పంపిస్తామని విమానాశ్రయ వర్గాలు తెలిపాయి.విమానం AI 159 మధ్యాహ్నం 1.10 గంటలకు బయలుదేరాల్సి ఉంది. దానిని మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి షెడ్యూల్ చేశారు. కానీ 1.45 గంటలకు ఎయిరిండియా ఈ విమానాన్ని రద్దు చేస్తున్నట్లు ధ్రువీకరించింది. ఎయిరిండియా వెబ్ సైట్ ప్రకారం, ఈ విమానం కూడా గత వారం కూలిపోయిన బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్ విమానం కావడం గమనార్హం.గతవారం ఎయిరిండియా AI 171, అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న విమానం, టేకాఫ్ అయిన కొద్ది క్షణాలకే కుప్పకూలింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న 242 మందిలో ఒక్కరు మినహా అందరూ ప్రాణాలు కోల్పోయారు. విమానం డాక్టర్స్ హాస్టల్ బిల్డింగ్ పై కూలిపోయిడంతో నేలపై ఉన్న మరో 33 మంది కూడా మరణించారు.

# ఇజ్రాయిల్‌కి మద్దతు ఇవ్వడం దేనికి..?



- ఇరాన్‌తో మన దేశానికి ఆర్థిక సంబంధాలు ఉన్నాయి..
- ఇజ్రాయిల్ కి భారత్ మద్దతు ఇస్తోంది.. ఇదీ దారుణం..
- పాక్ విషయంలో కేంద్రం ఏదో దాస్తుందన్న బీవీ రాఘవులు..

**ఆంధ్రప్రదేశ్ :** ఇరాన్ తో మన దేశానికి ఆర్థిక సంబంధాలు ఉన్నాయి.. కానీ, ఇజ్రాయిల్ కి భారత్ మద్దతు ఇస్తోంది.. ఇదీ దారుణం అన్నారు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు.. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన వివిధ అంశాలపై స్పందించారు.. పెహల్గామ్ లో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రజలకు వివరించడానికి వారం రోజులు ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నాం.. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల స్థావరాలపై దాడిచేసి ధ్వంసం చేసింది.. మరి, పాకిస్థాన్, ఇండియా మధ్య యుద్ధం ఆపింది నేనే అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నాడు.. దీంతో, కేంద్రం ఏదో దాస్తుంది అనే అనుమానం కలుగుతుందన్నారు.. ఇజ్రాయిల్, ఇరాక్ మధ్య యుద్ధాన్ని కూడా ఆపుతామంటూ ట్రంప్ ప్రకటించారని గుర్తుచేశారు..ఇక, గతంతో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీని గుర్తు చేసుకోవాలి.. నాటి పరిస్థితికంటే మరింత దారుణమైన పరిస్థితులు ఇప్పుడు వచ్చాయని విమర్శించారు బీవీ రాఘవులు.. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్న ఆయన.. ఇరాన్.. ఇజ్రాయిల్ పై దాడి చేసింది.. ఈ యుద్ధం తీవ్రమైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దెబ్బతగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.. యుద్ధం నుండి వెనక్కి తగ్గాలని ఇజ్రాయిల్ పై ఒత్తిడి తీసుకుని రావాలని సూచించారు.. ఇజ్రాయిల్ కి భారత్ మద్దతు ఇస్తోంది.. ఇదీ దారుణం అన్నారు.. ఇరాన్ తో మన దేశానికి ఆర్థిక సంబంధాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తుచేశారు.. ఇజ్రాయిల్ దాడిని భారత్ ఖండించాలి.. ఇప్పటికే 10శాతం క్రూడాయిల్ ధరలు పెరిగాయి.. భారత్ ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. అయితే, అమెరికా చెప్పిన విధంగా ప్రధాని మోడీ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.. పార్లమెంట్ సమావేశాలు వేసి ఈ అంశాలపై చర్చించాలి.. పార్లమెంట్ ముందు ప్రకటన చేయడం అంటే అది ప్రభుత్వ ప్రకటనగా భావిస్తాం.. పార్లమెంట్ మీద ఇంకా నమ్మకం పోలేదన్నారు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు..

# కాంట్రాక్టర్ వద్ద కక్కుర్తి



**కాప్రా ,ఫ్లాష్ ఇండియా :** కాప్రా సర్కిల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించి ఓ అసిస్టెంట్ ఇంజనీర్ ను లంచం తీసుకుంటూ ఉండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. చర్లపల్లి ఏఈ స్వ రూప ఓ కాంట్రాక్టర్ నుంచి రూ. 1.20 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. రామ్ రెడ్డి అనే కాంట్రాక్టర్ తన బిల్లులు చెల్లించడానికి ఏఈ స్వ రూప రూ. 1.20 లక్షలు లంచంగా డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.స్వ రూప లంచం కోసం ఒత్తిడి చేయడంతో కాంట్రాక్టర్ రామ్ రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, కాప్రా మున్సిపల్ కార్యాలయం గేటు దాటేలోపే ఏఈ స్వ రూపను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి రూ. 1.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా ఏఈ స్వ రూప పై కాంట్రాక్టర్లను లంచాల కోసం వేధింపులకు గురి చేసిందనే ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో జీహెచ్ఎంసీ కార్యాలయంలో అవినీతి మరోసారి బట్టబయలైంది. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టారు.

# ఘోర రోడ్డు ప్రమాదం


- మహబూబాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- వ్యక్తి మృతి.. ఏడుగురికి గాయాలు



**మహబూబాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** మహబూబాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా మరో 7 మంది గాయాలపాలయ్యారు. మహబూబాబాద్ -కేసముద్రం ప్రధాన రహదారి పై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మహబూబాబాద్ మండలం వేంనూరు గ్రామ శివారు నేతాజీ తండా వద్ద అశోక్ లీలాండ్ వాహనాన్ని గ్రానైట్ లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుగులోత్ రాజు అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.బాధితులంతా ఒకే కుటుంబానికి చెందిన నెల్లికుదుర్ మండలం మీట్యా తండా గ్రామపంచాయతీ పరిధిలోని పంతులు తండాకు చెందినవారు. ఇల్లందు సమీపంలో మిర్యాలపెంట గ్రామంలో శుభకార్యానికి హాజరై తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయకచర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

# సెవెన్ హిల్స్ ఎక్స్ ప్రెస్ లో మంటలు

- తిరుపతి నుంచి సికింద్రాబాద్ వస్తున్న సెవెన్ హిల్స్ ఎక్స్ ప్రెస్ లో మంటలు
- సకాలంలో మంటలు ఆర్పివేశారు రైల్వే సిబ్బంది



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఓ వైపు రోడ్డు ప్రమాదాలు.. ఓ వైపు విమాన ప్రమాదాలు, మరోవైపు రైలు ప్రమాదాలు ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. అనుకోకుండా చోటుచేసుకుంటున్న ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. చాలామంది గాయాలపాలవుతున్నారు. తాజాగా ఓ రైలులో మంటలు చెలరేగాయి. తిరుపతి నుంచి సికింద్రాబాద్ వస్తున్న 127 69 నెంబర్ గల సెవెన్ హిల్స్ రైలు చిగిచెర్ల రైల్వే స్టేషన్ సమీపంలో రైలు చివరి భాగంలో గార్డు భోగి కంటే ముందు భోగి వద్ద బ్రేకులు పడి మంటలు చెలరేగాయి.దీంతో అందులోని ప్రయాణికులు ప్రాణ భయంతో వణికిపోయారు. కేకలు వేస్తూ గార్డుకు, లోకో పైలట్ ను అప్రమత్తం చేయడంతో రైలును నిలిపివేశారు. ప్రయాణికులు బోగీల్లోంచి కిందికి దిగారు. సకాలంలో మంటలు ఆర్పివేశారు రైల్వే సిబ్బంది. అరగంట తర్వాత రైలు సికింద్రాబాద్ కు పయనమైంది. కాగా ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఘటనపై రైల్వే అధికారులు ఆరా తీస్తున్నారు.

# అదుపు తప్పిన లారీ



**కీసర ,ఫ్లాష్ ఇండియా :** కీసర పోలీస్ స్టేషన్ పరిధి కీసర ఔటర్ రింగ్ రోడ్డు వద్ద సోమవారం అర్ధరాత్రి లారీ అదుపు తప్పింది. కీసర సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.కీసర నుండి నాగారం ఆర్ ఎం సీ రెడ్ మిక్స్ కి కంకర లోడుతో వెళ్తున్న లారీ కీసర ఔటర్ రింగు రోడ్డు వద్దకు రాగానే ఒక్కసారి మలుపు వద్ద బ్రేక్ ఫెయిల్ అయి అదుపు తప్పింది.ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు డ్రైవర్ కూడా సురక్షితంగానే ఉన్నాడు అని తెలిపారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డుపై భారీ వాహనాలు వేగంతో కాకుండా నిదానంగా వెళ్ళాలి అని స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తాం అని అన్నారు.

# ప్రియుడితో కలిసి భర్తపై దాడి..

- ఆసిఫ్ నగర్ లో భర్తపై ప్రియుడుతో కలిసి దాడి
- భర్త ఒసామాకు తీవ్ర గాయాలు

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** భార్యలపాలిట యుముడిగా మారిన భర్తలు.. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడంతా రివర్స్ అయ్యింది. భర్తల పాలిట యముడిగా మారుతున్నారు కొందరు భార్యలు. అక్రమసంబంధాల మోజులో పడి కట్టుకున్న భర్తను కాటికి పంపిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం జరిగిన మేఘాలయ హనీమూన్ మర్డర్ కేసు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సోనమ్ అనే యువతి పెళ్లైన నాలుగు రోజులకే భర్తను ప్రియుడి సాయంతో కిరాయి హంతకులను పెట్టి చంపించింది. అంతకు ముందు మీరట్ లో ముస్కాన్ కూడా తన భర్తను ప్రియుడి సాయంతో ముక్కలు ముక్కలుగా నరికి డ్రమ్ములో పెట్టి సిమెంట్ తో కప్పేసింది. ఇప్పుడు హైదరాబాద్ లో మరో ఘటన కలకలం రేపింది. ఆసిఫ్ నగర్ లో భర్తపై ప్రియుడుతో కలిసి దాడి చేసింది ఓ భార్య.ఏడాదిక్రితం షైస్తాను అనే మహిళ ఓసామా ను వివాహం చేసుకుంది. ఆరు నెల క్రితం భర్త షైస్తాను దుబాయ్ కి పంపించింది. భర్తను దుబాయ్ కి పంపి షైస్తాను అమీర్ తో సహజీవనం చేస్తోంది. ఇటీవల తిరిగి వచ్చిన ఓసామాకు విషయం తెలియడంతో భార్యను నిలదీశాడు. దీంతో భర్తను అడ్డుతొలగించుకోవాలని భావించిన షైస్తాను సుపరి గ్యాంగ్ ను పెట్టుకొని భర్త ఓమాపై ప్రియుడుతో కలిసి దాడికి పాల్పడింది. ఈ దాడిలో భర్త ఒసామాకు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు.

# మెట్రో సెకండ్ ఫేజ్‌కు గ్రీన్ సిగ్నల్



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ప్రతిష్టాత్మంగా చేపట్టబోతున్న హైదరాబాద్ మెట్రో రైలు సెకండ్ ఫేజ్ (బి) ప్రాజెక్ట్ కు తెలంగాణ సర్కార్ పరిపాలనా పరమైన అనుమతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి ఇలంబర్తి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ మెట్రో రైలు సెకండ్ ఫేజ్ లో భాగంగా మొత్తం రూ.19,579 కోట్ల అంచనా వ్యయంతో 86.1 కి.మీ మేర ప్రాజెక్ట్ నిర్మాణం కానుంది. ఇందులో కారిడార్-9లో ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కిమీ., కారిడార్-10లో JBS నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ., కారిడార్-11లో JBS నుంచి శామీర్ పేట్ వరకు 22 కి.మీ మేర ప్రాజెక్ట్ ను చేపట్టనున్నారు.హైదరాబాద్ ఎయిర్ పోర్టు మెట్రో లిమిటెడ్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్ గా హైదరాబాద్ మెట్రో రైలు సెకండ్ ఫేజ్ పనులు కొనసాగుతాయి. కాగా, ఇందులో తెలంగాణ ప్రభుత్వ వాటా 30 శాతం, కేంద్ర ప్రభుత్వ వాటా 18 శాతం, జైకా , ఏడీబీ , ఎన్డీబీ నుంచి రుణం వాటా 48 శాతం, పీపీపీ కాంపోనెంట్ 4 శాతంగా ఉంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు సెకండ్ ఫేజ్ (బి) పరిపాలనా అనుమతుల ఆర్డర్ కాపీతో పాటు DPRకు జత చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు.

# కిమ్స్ ఆసుపత్రిలో హరీష్ రావు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అస్వస్థతకు గురై కిమ్స్ ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. నిన్న మాజీ మంత్రి కేటీఆర్ ఏసీబీ విచారణ సందర్భంగా ఉదయం నుంచి హరీష్ రావు హైదరాబాద్ లోనే ఉన్నారు. రాత్రి కేటీఆర్ విచారణ పూర్తి చేసుకొని తెలంగాణ భవన్ కు రాగా.. అక్కడ అతనితో మాట్లాడిన హరీష్ రావు అస్వస్థతకు గురయ్యారు. ఉదయం నుంచి జ్వరంతో బాధపడుతున్న హరీష్ రావు డీహైడ్రేషన్ కారణంగా వైరల్ ఫివర్ తో బాదపడుతుండటంతో డాక్టర్లు ఆయన్ను ఆస్పత్రిలోనే అడ్మిట్ చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కేటీఆర్ రాత్రి బేగంపేటలోని కిమ్స్ సన్ షైన్ ఆసుపత్రి లో చేరిన హరీష్ రావును పరామర్శించారు. అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితులపై డాక్టర్లతో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. అనంతరం వైరల్ ఫీవర్ తో బాధపడుతున్న హరీష్ రావును పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు కేటీఆర్ సూచించినట్లు తెలుస్తోంది. వైరల్ ఫీవర్ తగ్గిన వెంటనే హరీష్ రావును డిశ్చార్జి చేస్తామని కిమ్స్ వైద్యులు తెలిపారు.

# తండ్రిపై కుమార్తె రోకలి బండతో దాడి

**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** రక్త సంబంధాలు రోజు రోజుకు కనుమరుగైపోతున్నాయి. ఆస్తులు, ఇంట్లో గొడవలు ఇలా రకరకాల కారణాలతో ఆయా కుటుంబ సభ్యులు రక్తసంబంధాలనే మరిచిపోతున్నారు. దాడులు చేసుకుంటూ హత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా కన్నతండ్రిని కుమార్తె రోకలి బండతో కొట్టి చంపిన విషాదకర సంఘటన నిజామాబాద్ జిల్లా, నవీపేట్ మండలం, ధర్మారం గ్రామంలో చోటుచేసుకుంది.

**వివరాల్లోకి వెళితే..**

వ్యసనాలకు బానిసైన తండ్రి పుల్లెపు నర్సయ్య (54)తో కుమార్తె వర్షిత గొడవ పడింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఘర్షణ పెరిగి పెద్దదయింది. దీంతో ఆవేశంలో కుమార్తె కన్న తండ్రిపై రోకలి బండతో దాడి చేసి కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న నవీపేట్ ఎస్ఐ వినయ్ గ్రామానికి చేరుకొని ఈ సంఘటనపై విచారణ చేపట్టారు. నిందితురాలిని అదుపులోకి తీసుకుని.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పెట్రోల్ పంపు ఘరానా మోసం

- ఉప్పల్ లో భారత్ పెట్రోల్ పంపు ఘరానా మోసం
- యాజమాన్యం మిషన్ లో సెట్టింగ్ పెట్టి పెట్రోల్ తక్కువ పోస్తున్నట్లు వెల్లడైంది



**ఉప్పల్,ఫ్లాష్ ఇండియా :** పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వాహన యజమానులకు ఆందోళన కలిగిస్తుంది. మరోవైపు పెట్రోల్ పంపులు మోసాలకు పాల్పడుతుండడంతో వాహన దారులు తీవ్రంగా నష్టపోతున్నారు. మీటర్ ను రీ సెట్ చేయకపోవడం, ఎలక్ట్రానిక్ చిప్ లు పెట్టి మోసం చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్ లోని ఉప్పల్ లో ఘరానా మోసం వెలుగుచూసింది. భారత్ పెట్రోల్ పంపులో మోసం జరుగుతున్నట్లు వాహనదారులు తెలిపారు. మెహిఫిల్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న భారత్ పెట్రోల్ పంపులో జరుగుతున్న మోసాన్ని బయటపెట్టారు.బాటిల్ లో పెట్రోల్ కొట్టించగా పెట్రోల్ పంపు దందా బయట పడింది. యాజమాన్యం మిషన్ లో సెట్టింగ్ పెట్టి పెట్రోల్ తక్కువ పోస్తున్నట్లు వెల్లడైంది. ఇందేటి అని కస్టమర్లు ప్రశ్నించగా పొంతన లేని సమాధానంతో యాజమాన్యం బుకాయిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 100 రూపాయల పెట్రోల్ ను బాటిల్ లో కొట్టించగా తక్కువ వచ్చింది. ఇదేంటి అని అడగగా 100 రూపాయలకు అంతే వస్తుందని నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నట్లు వాహన దారులు ఆరోపించారు. అధికారులు భారత్ పెట్రోల్ పంపుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అనుమతులు సరే.. నిబంధనలేవి?

**రంగారెడ్డి ,ఫ్లాష్ ఇండియా :** మట్టి వ్యాపారం రంగారెడ్డి జిల్లాలో జోరుగా నడుస్తోంది. ఎర్రమట్టి, బంకమట్టికి డిమాండ్ భారీగా ఉంది. రెవెన్యూ, మైనింగ్ అధికారులు కుమ్మక్కై మట్టి వ్యాపారంలో భాగస్వా మ్యం అవుతున్నారనే అరోపణలు వినిపిస్తున్నాయి. అర్బన్ ప్రాంతాల్లో ఇండ్లు నిర్మించుకునేదారులకు ఎర్రమట్టి తప్పనిసరిగా మారిపోయింది. దీంతో ట్రిప్పర్‌కు రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు వసూళ్లు చేస్తున్నారు. అదే విధం గా ఇటుక వ్యాపారులు గ్రామాల్లో ఉన్న చెరువులను అనాధికారికంగా స్థానిక ప్ర జాప్రతినిధులు, ప్రభావితం చేసే రాజకీ య నాయకుల సాయంతో తూతూ మం త్రంగా మైనింగ్ అనుమతి తీసుకున్నామ ని చెప్పి ఇష్టానుసారంగా నల్లరేగడి మట్టి ని తరలిస్తున్నారు. ప్రభుత్వానికి చెల్లించి న ఆదాయంతో పోలిస్తే మట్టితో వ్యాపా రం చేసే వాళ్లు సంపాధించిందే అధికమనే ప్రచారం ఉంది. కానీ ప్రభుత్వానికి చెల్లించిన నగదు నిబంధనల ప్రకారం చెల్లించకుండా అధికారులతో కుమ్మక్కై చేతివాటాకు పాల్పడుతున్నారు. ఈ విధంగా అధికారులు, వ్యాపారులు చేసే పనులకు స్థానిక గ్రామాల ప్రజలు రాత్రి సమయాల్లో సౌండ్ పొల్యూషన్, వాహనదారుల రాకపోకలతో ప్రమాదాలకు గు రౌతున్న ఘటనలు జిల్లాలో కనిపిస్తున్నా యి. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఏమీ తెలియదనే నల్లరేగడి మట్టి తరలించే వ్యాపా రులు రోజుకో దారి నుంచి ప్రయాణించడంపై అనుమానాలు వస్తున్నాయి.మాడ్గుల మండలం గిరికొత్తపల్లి గ్రామ రెవె న్యూ పరిధిలోని సర్వే నెంబర్ 114లో 2హెక్టార్ స్థలం అన్నేపాక రామయ్య నల్లరేగడి మట్టిని తరలించేందుకు 4500 మేట్రిక్ టన్నులకు అనుమతి తీసుకున్నా రు. అందుకు రూ. 90వేల మైనింగ్ శాఖ కు చెల్లించినట్లు జిల్లా అధికారి ఎం నర్సి రెడ్డి పేరుతో ఓ అనుమతి పత్రం ఉంది. ఈ అనుమతికి తరలించే మట్టికి సంబం ధం లేదని స్థానిక గ్రామ ప్రజలు వివరిస్తు న్నారు. 4500 మెట్రిక్ టన్నుల మట్టిని 23 మే నుంచి 01, జూలై 1 వరకు తరలించుకోవచ్చు అని అధికారులు అనుమతినిచ్చారు. ఈ మట్టి తరలించేందుకు నిత్యం ఎన్ని వాహనాలు నడిపించాలి, ఎంత లోతు వరకు మట్టిని తొవ్వుకోవా లి, ఈ లెక్కలన్ని ఎవరు గమనిస్తు న్నారనే విషయం పరిగణలోకి తీసుకోలేదు. అం తేకాకుండా ఏఏ గ్రామాల నుంచి ఈ వాహనాలు ప్రయాణించాలనే విషయా న్ని కచ్చితంగా నిబంధనల్లో పొందుపర్చాలి. కానీ ఇవేవీ లేకుండా మైనింగ్ ఇచ్చిన ఒక్క లేటర్‌ను అడ్డుపెట్టుకోని రో జుకు వందల వాహనాల్లో తరలించే వా హనాలు ఏ అధికారి లెక్కిస్తున్నారో తెలి యదు. అధికారికంగా మాత్రమే రూ. 90 వేల చెల్లించి, అనాధికారికంగా లక్షలు చేతులు మారుతున్నట్లు ప్రచారం సాగు తోంది. స్థానికంగా ఉండే అధికారులు కూడా పెద్దగా పట్టించుకునే పాపాన పోవ డం లేదని ఆరోపణలున్నాయి.నిత్యం వేలాది మంది ప్రయాణించే రహదారులు ఇటుక బట్టిలకు తరలించే మట్టి వాహనాలతో దెబ్బతిన్నాయి. దీంతో రోడ్లు అన్ని గుంతల మయంగా మారిపోవడంతో టూవీలర్ వాహనాదారులు రాత్రి సమయంలో ప్రమాదాలకు గురైతున్నారు. ఓవర్ లోడుతో మట్టి తరలిస్తున్న వాహనాలపై నిఘా ఎందుకు పెట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదో మైనింగ్ లేటర్ ఉందని ఆసరా చేసుకోని ఇష్టానుసారంగా మట్టి తరలిస్తే వదిలేయడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తు న్నారు. ఫిర్యాదులు చేసే వారిని టార్గెట్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వివరిస్తున్నారు.వందల లారీలతో రాత్రి పగలు తేడా లేకుం డా ఇష్టానుసారంగా నల్లరేగడి మట్టి తరలిస్తున్నారు. మాడ్గుల మండ లం గిరి కొత్తపల్లి రెవెన్యూ పరిధిలోని నర్సంపల్లి చెరువు నుంచి ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఇటుకబట్టిలకు మట్టి తరలిస్తున్నారు. ఈ తరలింపుతో ఆ గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. నర్సంపల్లి నుంచి వయా ఆర్కపల్లి, బ్రహ్మణపల్లి, మాడ్గు ల, నర్సాయిపల్లి, కొలుకులపల్లి మీదు గా సాగర్ హైవే రోడ్డుకు కొన్ని టిప్ప ర్లు.. ఆర్కపల్లి, సుద్దపల్లి, సాగర్ హైవే పైకి మరికొన్ని ట్రిప్పర్లు ఉదయం సమయంలో ఇరుకు రహదారుల్లో ప్ర యాణిస్తున్నాయి. మైనింగ్ ఇచ్చిన అనుమతిలో ఒక రూట్ మ్యాప్ లేకపోవడం పై గమానర్హం. అంతేకాకుం డా ఈ రహదారుల్లో ఉదయం, సా యంత్రం అనే తేడా లేకుండా ట్రాఫిక్‌తో ఇబ్బం దులు పడుతున్నారు. కార్లు, బైకులు ఒకే సారి రాకపోకలు జరిగే పరిస్థితి లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పౌరులకు ఏవీ రంగనాథ్ సూచన

## ఇల్లు కొంటున్నారా.. నాలాపై ఉందా చూడండి



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఇల్లు కొనుగోలు చేసే సమయంలో చెరువు ఎఫ్ టీఎల్ , బఫర్ జోన్ తరహాలోనే నాలా ఆక్రమించి నిర్మాణం చేపట్టారా అన్నది కూడా చెక్ చేసుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పౌరులకు సూచించారు. బుద్ధభవన్ లో సోమవారం జరిగిన ప్రజావాణిలో 47 ఫిర్యాదులు వచ్చాయి. మల్కాజ్ గిరి, బాచుపల్లి, సికింద్రాబాద్ లోని పద్మారావునగర్ , మాదాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన వారు నాలాల ఆక్రమణలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.గ్రామ పంచాయతీ అనుమతితో లే అవుట్లు చేసి గతంలోనే విక్రయించిన స్థలాలకు వ్యవసాయ భూములంటూ తప్పుడు పాస్ పుస్తకాలతో కొందరు వ్యక్తులు కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ప్లాట్ల యజమానులు రంగనాథ్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై స్పందించిన ఆయన పాత లే అవుట్లలోని రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడుతూనే అమాయకులు మోసపోకుండా చర్యలు తీసుకుంటున్నామని ఫిర్యాదుదారులకు భరోసానిచ్చారు.

**ప్రజావాణికి దృష్టికి వచ్చిన కొన్ని ఫిర్యాదులు**

ఘట్‌కేసర్ మండలం పోచారం మునిసిపాలిటీ పరిధి కొర్రెముల గ్రామం సర్వే నంబర్ 739 నుంచి 749 వరకు ఉన్న 147 ఎకరాల్లో ఏకశిలానగర్ లే అవుట్‌ను 1985లో అభివృద్ధి చేశారు. 2006లో అందులోని 47 ఎకరాలను వ్యవసాయ భూమిగా చూపుతూ ఓ వ్యక్తి లే అవుట్ స్వరూపం మార్చారు. ఇదే లే అవుట్‌లో రెండు బడా రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రహరీలు నిర్మించి కొంత మేర కాజేశాయి.

కొర్రెములలోని సర్వే నంబర్ 796లో 11.20 ఎకరాల భూమి ఉండగా, ఇందులో 7.20 ఎకరాల్లో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారు. పంజాగుట్ట ఆఫీసర్స్ కాలనీలో 1000 చ.గ పార్కు స్థలంలో సగం జాగాలో దుర్గాభవానీ ఆలయం నిర్మించారు. మిగతా 500 గజాల స్థలం కబ్జాకాకుండా పార్కు అభివృద్ధి చేయాలి. అల్వాల్ మండలం జొన్నబండ గ్రామంలోని వజ్ర ఎన్‌క్లేవ్‌లో 900 చ.గల పార్కు స్థలం కబ్జా అవుతోంది.

తూముకుంట మునిసిపాలిటీ దేవరయాంజల్ గ్రామంలోని తురకొని కుంట శిఖం భూమిలో వేయింగ్ మిషన్ ఏర్పాటు చేస్తున్నారని సీతారామచంద్ర స్వామి దేవస్థానం భూముల పరిరక్షణ సమితి ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.

# సెల్ ఫోన్, ల్యాప్ టాప్ అప్పగించాలని ఏసీబీ ఆదేశాలు..

- ఫార్ములా ఈ- కార్ రేసు కేసులో ఏసీబీ దూకుడు..
- రేపటిలోగా సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ అప్పగించాలని కేటీఆర్‌కు ఆదేశం..
- న్యాయసలహా ప్రకారం నడుచుకుంటానన్న కేటీఆర్..

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో ఏసీబీ అధికారులు దూకుడు పెంచారు. రేపటిలోగా సెల్ ఫోన్ , ల్యాప్ టాప్ అప్పగించాలని కేటీఆర్ కు ఆదేశాలు జారీ చేశారు. కేటీఆర్ వాడిన సెల్ ఫోన్, మ్యాక్ బుక్, ట్యాబ్ లో కీలక సమాచారం ఉందని ఏసీబీ భావిస్తుంది. ఈ ఎలక్ట్రానిక్ పరికరాల నుంచే కేటీఆర్ అధికారులకు ఆదేశాలు జారీ చేసి ఉంటారని ఏసీబీ యోచిస్తుంది. అయితే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్టేట్ మెంట్ ఆధారంగా డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు రెడీ చేస్తున్నారు. దీంతో ఏసీబీ ఆదేశాలపై కేటీఆర్ న్యాయసలహా ప్రకారం నడుచుకుంటాను అని తేల్చి చెప్పారు.అయితే, ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో శనివారం నాడు ఏసీబీ విచారణకు కేటీఆర్ హాజరయ్యారు. ఈ కేసులో ఆయన ఏ1గా ఉన్నారు. ప్రభుత్వ సంస్థల నుంచి అనుమతి లేకుండానే విదేశీ సంస్థకు నగదు చెల్లించినట్లు అతడిపై ఆరోపణలు ఉన్నాయి. సుమారు 7 గంటల పాటు విచారణ చేసిన ఏసీబీ.. అవసరం అయితే, మరోసారి పిలుస్తామని తెలిపింది. అలాగే, గతంలో ఉపయోగించిన సెల్ ఫోన్లు, ల్యాప్ టాప్ లు తీసుకు వచ్చి హ్యాండోవర్ చేయాలని ఏసీబీ తెలిపినట్లు సమాచారం.



# మాకు అపాయింట్మెంట్ ఇవ్వండి



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి తమకు అపాయింట్మెంట్ ఇవ్వాలని గోషామహాల్ ఎమ్మెల్యే రాజసింగ్ విజ్ఞప్తి చేశారు. తాను కిషన్ రెడ్డిని వ్యక్తిగతంగా కలిసి సమస్యలు చెప్పాలని అనుకుంటున్నానని, అందుకని తమకు సమయం కేటాయించాలని కోరారు. ఎప్పుడు, ఎక్కడికి వచ్చి కలవమని చెప్పినా తాను వచ్చి కలుస్తానని అన్నారు. రాష్ట్రానికి, దేశానికి బీజేపీ అవసరమని.. ఈ సమయంలో వ్యక్తిగత విషయాలు పక్కన బెట్టి పార్టీలో అంతా ఐక్యంగా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. కాగా గత కొంతకాలంగా రాష్ట్ర అధినాయకత్వాన్ని, నేతలను టార్గెట్ చేస్తూ రాజసింగ్ పలు సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సడన్ గా ఇలా యూ టర్న్ తీసుకొని.. కిషన్ రెడ్డిని కలవాలని మీడియా ముఖంగా కోరడం గమనార్హం.

# బుడ్డోడు అన్నారు కదరా



టెంబా బ వుమా ... ఇప్పుడు సోషల్ మీడియా ఓపెన్ చేస్తే... ఎక్కడ చూసినా అతని ఫోటోలు, వీడియోలు మాత్రమే వస్తున్నాయి. అదే సమయంలో టెంబా బ వుమా సాధించిన రికార్డుల గురించి సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతుంది. దీనికి కారణం... వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్ ఛాంపియన్ గా దక్షిణాఫ్రికా జట్టును నిలపడమే. టెంబా బ వుమా కెప్టెన్సీలో... 27 సంవత్సరాల తర్వాత ఐసీసీ టోర్నమెంట్ గెలిచింది దక్షిణాఫ్రికా.గత వారంలో.. లండన్ లోని లార్డ్స్ వేదికగా దక్షిణాఫ్రికా వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్ ఫైనల్ మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ఇందులో అద్భుతంగా రాణించిన దక్షిణాఫ్రికా టీం... ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. ఈ ఫైనల్ మ్యాచ్ లో ఐదు వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది సౌత్ ఆఫ్రికా. అయితే ఈ మ్యాచ్ లో దక్షిణాఫ్రికా విజయం సాధించడం వెనుక కెప్టెన్ టెంబా బ వుమా కృషి కచ్చితంగా ఉంది.టెంబా బ వుమా వల్లే ఇది సాధ్యమైంది. ఈ నేపథ్యంలోనే... ప్రపంచ వ్యాప్తంగా అతనిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. అయితే తాజాగా టెంబా బ వుమా ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ టైటిల్ పట్టుకొని ఫోటోలు దిగాడు టెంబా బ వుమా. నార్మల్ వైట్ జెర్సీలో కాకుండా.. ఫార్మల్ డ్రెస్ లో... కని పించడమే కాకుండా... బ్లాక్ స్పెట్స్ పెట్టుకొని రచ్చ లేపాడు. దీనికి సంబంధించిన ఫోటోలు ఇప్పుడు వైరల్ గా మారాయి. వీటిని చూసిన... క్రికెట్ అభిమానులు తెగ కామెంట్స్ పెడుతున్నారు. హాలీవుడ్ హీరో రేంజ్ లో టెంబా బ వుమా ఉన్నాడని కామెంట్స్ చేస్తున్నారు.

# ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్

టీం ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య ఐదు టెస్టుల సిరీస్ అతి త్వరలోనే ప్రారంభం కానుంది. ఈనెల 20వ తేదీ అంటే మరో మూడు రోజుల్లోనే ఈ ఐదు టెస్టుల సిరీస్ ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే ఇంగ్లాండ్ చేరుకున్న టీమిండియా ప్రాక్టీస్ కూడా మొదలు పెట్టింది. గిల్ సారధ్యంలో దుమ్ము లేపేందుకు సిద్ధమైంది

టీమిండియా..రోహిత్ శర్మ అలాగే విరాట్ కోహ్లీ లాంటి సీనియర్ ప్లేయర్లు లేకపోయినా... ఇంగ్లాండ్ ను ఓడిస్తామని యంగ్ క్రికెటర్లు కూడా చెబుతున్నారు. అయితే ఇలాంటి నేపథ్యంలో టీమిండియా కు భారీ ఊరట లభించింది. ఐదు టెస్టుల సిరీస్ కోసం టీమ్ ఇండియా బౌలర్... ఇంగ్లాండ్ లో దిగాడని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇంగ్లాండ్ సిరీస్ కోసం ఇప్పటికే 18 మందిని భారత క్రికెట్ నియంత్రణ మండలి సెలెక్ట్ చేసింది.ఇప్పుడు 19వ ప్లేయర్ గా హర్షిత్ రానాను బరిలోకి దించబోతున్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇండియా A జట్టుమొత్తం భారత్ బయలు దేరినప్పటికీ హర్షిత్ రానా మాత్రం ఇంగ్లాండ్ లోనే ఉన్నాడని అంటున్నారు. ఇది ఇలా ఉండగా తొలి మ్యాచ్ కోసం ఐదుగురు బౌలర్లను ఆడించాలని టీమిండియా యాజమాన్యం భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.




# వరల్డ్ నెం1 బ్యాటర్‌గా స్మృతి

టీమిండియా మహిళల జట్టు స్టార్ ప్లేయర్ స్మృతి మంధాన అరుదైన రికార్డు సాధించారు. తాజాగా ప్రకటించిన ఐసీసీ ర్యాంకింగ్స్ లో స్మృతి మంధాన అదరగొట్టారు. ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్ లో... తిరిగి నెంబర్ వన్ స్థానాన్ని దక్కించుకున్నారు. దాదాపు 5 సంవత్సరాల తర్వాత ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్ లో.. మొదటి స్థానాన్ని దక్కించుకున్నారు స్మృతి మంధాన.అటు అదే సమయంలో.. టి20 మ్యాచ్ లో కూడా ఆమె... టాప్ 5 లోకి దూసుకు వచ్చారు. ఐసీసీ టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్ లో.. ఏకంగా నాలుగవ స్థానాన్ని సంపాదించు కున్నారు. వన్డే అదే సమయంలో టి20 లో కూడా ర్యాంకింగ్స్ మెరుగుపరుచుకున్న స్మృతి మంధాన పై ప్రశంసల జల్లు కురుస్తోంది. కాగా ఐదేళ్ల కిందట అంటే 2019లో ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్ లో స్మృతి మంధాన నంబర్ 1 స్థానాన్ని దక్కించుకుంది. ఇక ఇప్పుడు మరోసారి నంబర్ 1 స్థానాన్ని దక్కించుకున్నారు.



# మ్యాచ్‌లో ఒకటి కాదు మూడు సూపర్ ఓవర్లు

క్రికెట్ చరిత్రలో ఇది గుర్తుండిపోయే మ్యాచ్. ఎందుకంటే మ్యాచ్ ఫలితం తేలడానికి ఏకంగా మూడు సూపర్ ఓవర్లు ఆడాల్సి వచ్చింది. క్రికెట్ మ్యాచ్ లో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ప్రతి బంతి, ప్రతి పరుగు, ప్రతి వికెట్ మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేస్తుంటాయి. ఇక సూపర్ ఓవర్ విషయానికి వస్తే, ఉత్కంఠత తారాస్థాయికి చేరుకుంటుంది. కానీ ఒక మ్యాచ్ లో ఒకటి కాదు మూడు సూపర్ ఓవర్లు ఆడితే ఏమి జరుగుతుందో ఊహించుకోండి? ఇలాంటిదే జరిగింది. ఇది ప్రతి క్రికెట్ అభిమానిని ఆశ్చర్యపరిచింది. నెదర్లాండ్స్, నేపాల్ మధ్య T20 మ్యాచ్ లో జరిగింది.నేపాల్ vs నెదర్లాండ్స్ (NED vs NEP T20 క్రికెట్ మ్యాచ్) మధ్య జరిగిన మ్యాచ్ లో, ఒకటి కాదు, మూడు సూపర్ ఓవర్లు వేయాల్సి వచ్చింది. చివరి సూపర్ ఓవర్ లో, ఐదు బంతులు మిగిలి ఉండగానే మైఖేల్ లెవిట్ ఆరు పరుగులు చేయడంతో మ్యాచ్ ఫలితం తేలింది. ఈ మ్యాచ్ లో ముందుగా బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ జట్టు 7 వికెట్లకు 152 పరుగులు చేసింది, దీనిలో బాస్ డి లీడే (35) మరియు విక్రమ్ జిత్ సింగ్ (30) ఇన్నింగ్స్ లు ఆడారు.



నెదర్లాండ్స్ మ్యాచ్ గెలుస్తుందని అనిపించింది. కానీ నేపాల్ హోరాహోరీగా పోరాడింది. చివరి ఓవర్లో నందన్ యాదవ్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి, చివరి బంతికి ఫోర్ కొట్టి స్కోరును సమం చేశాడు. దీని కారణంగా మ్యాచ్ సూపర్ ఓవర్ కు దారితీసింది. ఈ మ్యాచ్ లో నేపాల్ తరపున కెప్టెన్ రోహిత్ అత్యధికంగా 48 పరుగులు చేశాడు.

**3 సూపర్ ఓవర్ల స్కోరు**

తొలి సూపర్ ఓవర్ లో నేపాల్ 19/1 స్కోరు చేయగా, నెదర్లాండ్స్ మైఖేల్ (6*), (12*) రాణించడంతో 19 పరుగులు చేసి తొలి సూపర్ ఓవర్ లో మ్యాచ్ ను టై చేసింది. రెండో సూపర్ ఓవర్ లో నెదర్లాండ్స్ మొదట బ్యాటింగ్ చేసి 17/2 స్కోరు చేసింది. నేపాల్ తరపున రోహిత్ (7* పరుగులు), దీపేంద్ర (10*) సహాయంతో నేపాల్ 17 పరుగులు చేసింది. మ్యాచ్ మూడో సూపర్ ఓవర్ కు వెళ్లింది. మూడో సూపర్ ఓవర్ నేపాల్ కు నిరాశ మిగిల్చింది. కెప్టెన్ రోహిత్ (0), దీపేంద్ర (0), రూపేష్ (0) ఔటయ్యారు. నెదర్లాండ్స్ జట్టుకు చెందిన మైఖేల్ ఒక సిక్స్ కొట్టి ఐదు బంతులు మిగిలి ఉండగానే 2 వికెట్ల తేడాతో చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. ట్రిపుల్ సూపర్ ఓవర్లు ఆడిన మ్యాచ్ లో నేపాల్ పై నెదర్లాండ్స్ ఘన విజయం సాధించింది.

# బిజినెస్

## మార్కెట్‌లోకి ట్రంప్ ఫ్యామిలీ ఎంట్రీ

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కుమారులు డొనాల్డ్ ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్ అమెరికాలో కొత్త మొబైల్ నెట్ వర్క్ సేవలను ప్రారంభించారు. “T1 మొబైల్” పేరుతో అందుబాటులోకి వచ్చిన ఈ సేవలు అమెరికా దేశవ్యాప్తంగా 5G కవర్ తో పాటు పూర్తిగా కస్టమర్ సపోర్ట్ ను కలిగి ఉంటాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పదవికి నామినేషన్ ప్రకటించి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దీనిని ప్రారంభించారు. అమెరికాలో ఉన్న మూడు ప్రధాన నెట్ వర్క్ లతో భాగస్వామ్యం ద్వారా ఈ సంస్థ విశ్వసనీయమైన, సరసమైన సెల్యులార్ సేవలను అందించనున్నట్టు ప్రకటించింది.ఇక T1 మొబైల్ కంపెనీ ప్రధాన ఆఫర్ గా “ది 47 ప్లాన్” పేరిట సేవలు అందిస్తోంది. ఇందులో అమితమైన కాల్స్, మెసేజులు, డేటా, డివైస్ ప్రొటెక్షన్, డ్రైవ్ అమెరికా ద్వారా 24/7 రోడ్ సైడ్ అసిస్టెన్స్, వర్చువల్ మెడికల్ కన్సల్టేషన్ లు, మెంటల్ హెల్త్ సపోర్ట్, ప్రిస్క్రిప్షన్ డెలివరీ వంటి టెలీహెల్త్ సదుపాయాలు అందించనున్నారు. అలాగే ఇందులో 100 కంటే ఎక్కువ దేశాలకు ఉచిత ఇంటర్నేషనల్ కాల్స్ (అమెరికా సైనిక స్థావరాలు ఉన్న దేశాలు) పొందవచ్చు. ఈ కనెక్షన్ కోసం ఎలాంటి కాంట్రాక్ట్ అవసరం లేదు.. అలాగే క్రెడిట్ చెక్ లేదు.T1 మొబైల్ నుంచి “T1 ఫోన్ (మోడల్ 8002)” ను కూడా లాంచ్ చేయనున్నారు. గోల్డ్ వేరియంట్ కోసం ప్రీ-ఆర్డర్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. అధికారిక వెబ్ సైట్ ప్రకారం సెప్టెంబర్ 2025లో విడుదల కానున్నా, సమాచారం మేరకు ఆగస్టులోనే ఈ మొబైల్ విడుదలయ్యే అవకాశముంది. ఈ ఫోన్ ధర 499.99 డాలర్స్ గా (సుమారుగా రూ. 43,000) నిర్ణయించారు. ఇక “ది 47 ప్లాన్” ప్రస్తుతం USD 47.45 (సుమారుగా రూ. 4083) నెలవారీ ఖర్చుతో అందుబాటులో ఉంది. దీనిని అధికారిక వెబ్ సైట్ trumpmobile.com ద్వారా కొనుగోలు చేయవచ్చు.




## ఎక్స్ చాట్ వచ్చేస్తోంది


ట్విట్టర్ ను సొంతం చేసుకున్న తరవాత ఎలాన్ మస్క్ అందులో అనేక అప్డేట్స్ తీసుకువస్తూ యూజర్లను ఆకట్టుకుంటున్నారు. ట్విట్టర్ పేరును ఎక్స్ గా మార్చి దాని పూర్తి స్వరూపాన్నే మార్చేశారు. ఇప్పటికే గ్రోక్ తీసుకురాగా యూజర్లను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇక మస్క్ ఎక్స్ చాట్ కూడా ప్రవేశపెట్టబోతున్నారంటూ గత కొద్దిరోజులుగా ప్రచారం జరగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా కొన్ని మిలియన్ల మంది ఉప యోగిస్తున్న వాట్సాప్ కు ఎక్స్ చాట్ పోటీ ఇవ్వబోతుందని భావిస్తున్నారు.ఎక్స్ చాట్ ద్వారా ఫోన్ నంబర్ లేకుండా ఆడియో, వీడియో కాల్స్ చేయ వ చ్చు. ఇక వారంలోపే ఈ యాప్ అందుబాటులోకి రాబోతుంద ని స మాచారం. మ స్క్ సైతం దీనిపై కీలక ప్రకటన చేశారు. ఎక్స్ చాట్ లో "ఎండ్ టూ ఎండ్ ఎన్ క్రిప్షన్, డిసప్పియరింగ్ మెసేజెస్ లాంటి ఆప్షన్స్ ఉన్నాయి. ఎక్స్ చాట్ ను ఎక్స్ యూజర్ల కోసం రూపొందించారు. ఇది




ఇప్పటికే ఉన్న ఎక్స్ ఆప్ డైరెక్ట్ మెసేజింగ్ సిస్టమ్ ద్వారా పనిచేస్తుంది." అని పేర్కొన్నారు.ఎక్స్ చాట్ లో ఒకరితో ఒకరు పర్సనల్ మెసేజెస్ లేదా గ్రూప్ మెసేజింగ్ కూడా చేసుకునే అవకాశం ఉంటుంది. ఇందులో చాట్ చేసిన వెంటనే క్లియర్ అయ్యే ఆప్షన్ కూడా ఉంది. దీనిని ఎంతో ఆకర్ష ణీయంగా మస్క్ తన మార్క్ చూపించేలా రూపొందించారు. మస్క్ ఎక్స్ ను అన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ కు పోటీ ఇచ్చేందుకు మెరుగులు దిద్దుతున్నారు. దీంతో వాట్సాప్, టెలిగ్రామ్ యాప్ లు ఎక్స్ పోటీకి తట్టుకోలు గుతాయా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

## నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..

అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలు, ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ముదురుతున్న ఉద్రిక్తతలు, క్రూడ్ ఆయిల్ ధరల్లో పెరుగుదల కారణంగా స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. ఈ ప్రతికూల ప్రభావాల కారణంగా మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడం నష్టాలకు ప్రధాన కారణం. అసియా మార్కెట్లు కూడా ఈ రోజు నష్టాలనే మూటగట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ కూడా నష్టాల బాటలోనే సాగాయిసోమవారం ముగింపు (81, 796)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం దాదాపు ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత నష్టాల బాట పట్టింది. చివరి వరకు నష్టాల్లోనే కదలాడింది. ఒక దశంలో దాదాపు 400 పాయింట్లు కోల్పోయి 81, 427 వద్ద ఇంట్రాడే కనిష్టానికి చేరింది. చివర్లో కాస్త పరిస్థితి సద్దుమణగడంతో భారీ నష్టాల నుంచి కోలుకున్నాయి. చివరకు సెన్సెక్స్ 212 పాయింట్ల నష్టంతో 81, 583 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 93



పాయింట్ల నష్టంతో 24, 853 వద్ద రోజును ముగించింది.సెన్సెక్స్‌లో మాజగాన్ డాక్, మహానగర్ గ్యాస్, ఏబీ క్యాపిటల్, పీబీ ఫిన్‌టెక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. హిందుస్తాన్ జింక్, సోనా బీఎల్‌డబ్ల్యూ, హిందుస్తాన్ కాపర్, జిందాల్ స్టీల్ షేర్లు నష్టాలను మూటగ ట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 389 పాయింట్ల నష్టంతో రోజును ముగించింది. బ్యాంక్ నిఫ్టీ 230 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 86.24గా ఉంది.

## టెక్కీలకు షాకిచ్చిన TCS

రోజురోజుకూ ఐటీ పరిశ్రమలో పరిస్థితులు కూడా బాగా దిగజారిపోతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా కంపెనీలు ఉద్యోగులను ఉన్నపళంగా తొలగిస్తుంటే.. భారతీయ టెక్ కంపెనీలు మాత్రం కొంచెం భిన్నంగా నిబంధనలను కఠినతరం చేస్తూ ముందుకెళుతున్నాయి. ఈ క్రమంలో టెక్ దిగ్గజ సంస్థలు తీసుకుంటున్న నిర్ణయాలు టెక్కీలకు కొత్త కష్టకాలాన్ని సూచిస్తున్నాయి. తాజాగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ తన కొత్త పాలసీ కింద ఉద్యోగులకు ఏడాదికి బెంచ్ మీద ఉండే కాలాన్ని గరిష్ఠంగా 35 రోజులకు పరిమితం చేస్తున్నట్లు ప్రకటించింది. అంటే దీని ప్రకారం సదరు ఉద్యోగులు ఏడాదిలో 225 రోజులు ప్రాజెక్టులపై పనిచేయాల్సిందే. కొత్త రూల్స్ జూన్ 12, 2025 నుంచి అమలులోకి వస్తాయని కంపెనీ స్పష్టం చేసింది. అయితే ఎక్కువ కాలం ఏ వర్క్ లేదా ప్రాజెక్ట్ అలాట్ కాకుండా బెంచ్ మీద ఉంటే కొత్త నిబంధనల ప్రకారం ఉద్యోగులకు ఆర్థిక నష్టాన్ని కలిగించవచ్చని టీసీఎస్ రిసోర్స్ మేనేజ్మెంట్ గ్రూప్ గ్లోబల్ హెడ్ చంద్రశేఖరన్ రామ్ కుమార్ వెల్లడించారు. పైగా ఈ పరిస్థితులు ఉద్యోగి కెరీర్, అంతర్జాతీయ పోస్టింగ్ పై ప్రభావాన్ని చూపటంతో పాటు ఉద్యోగం కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని అన్నారు. అయితే ఎలాంటి ప్రాజెక్ట్ లేదా వర్క్ అలాట్ కాని ఉద్యోగులు తమను తాము అప్ స్కిల్లింగ్ చేసుకునేందుకు ఆ సమయాన్ని ఇకపై ఉపయోగించుకోవాల్సి ఉంటుందని కంపెనీ చెబుతోంది. బెంచ్ మీద ఉన్న కాలంలో ఉద్యోగులు రోజుకు 4 నుంచి 6 గంటల సమయాన్ని తమ అప్ స్కిల్లింగ్ కోసం ఐ ఇవాల్స్, ఫ్రెస్కో ప్లే, వివిఎల్ఎస్, లింక్డిన్, మ్యాన్డేటరీ ట్రైనింగ్ వంటి వాటిపై గడపాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కంపెనీ జనరేటివ్ ఏఐ ఇంటర్వ్యూ కోచ్ కూడా ఉపయోగించాలి. అలాగే వేగంగా ప్రాజెక్టుల్లో ప్లేస్ చేయటానికి ఆఫీసుకు రావటాన్ని కూడా ఒక ప్రామాణికతగా కంపెనీ తీసుకుంటోంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే వర్క్ ఫ్రమ్ హోమ్ లేదా ఫ్లెక్సిబిలిటీలను అందించనుంది.



# మరోసారి వచ్చేందుకు రెడీ



కమల్ హాసన్ హీరోగా భారీ బడ్జేట్ చిత్రాల దర్శకుడు శంకర్ కాంబోలో వచ్చిన సినిమా ఇండియన్ 2. భారీ అంచనాల మధ్య ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. అటు శంకర్ ఇటు కమల్ హాసన్ కెరీర్ లో బిగ్గెస్ట్ డిజాస్టర్ అయింది. తమిళ్ ఆల్ టైమ్ డిజాస్టర్స్ లో టాప్ ప్లేస్ లో సంపాదించిన ఈ సినిమాతో చాలా ముంది డిస్ట్రిబ్యూటర్స్ కుదేలైపోయారు. అటు నిర్మాణ సంస్థ లైకా ఇండియన్ 2 దెబ్బతో భారీ నష్టాలను చూసింది.ఇంతటి భయంకరమైన ఫ్లాప్ అయిన ఇండియన్ 2 కు సీక్వెల్ ఉంటుందని సినిమా చివర్లో ప్రోమో జత చేసి మరి ప్రకటించాడు దర్శకుడు శంకర్. కానీ ఇండియన్ 2 ఫ్లాప్ కారణంగా ఇక పార్ట్ 3 అనేది జరగని పని అనుకున్నారు. కమల్ హాసన్ కూడా ఈ సినిమా చేసేందుకు సుముఖంగా లేదు, అటు లైకా కూడా శంకర్ తో సినిమా చేయదు అనే టాక్ వినిపించింది. కానీ ఇప్పుడు అందుతున్న సమాచారం ప్రకారం ఇండియన్ 3 షూట్ జరుగుతోందట. మరోవైపు ఎడిటింగ్ పనులు కూడా జరుగుతున్నాయట. అయితే ఈ సినిమాను థియేటర్ రిలీజ్ కోసం కాదని కేవలం ఓటీటీలో మాత్రమే రిలీజ్ చేస్తారని కూడా వినిపిస్తోంది. ఇండియన్ 2, గేమ్ ఛేంజర్ బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్స్ తో శంకర్ సతమతమవుతున్నాడు. ఇండియన్ 3 స్క్రిప్ట్ ను పక్కాగా రెడీ గా చేసి ఎలాగైనా సూపర్ హిట్ కొట్టి తానేంటో మరోసారి ప్రూవ్ చేసుకోవాలని చూస్తున్నాడు. ఎటొచ్చి బడ్జెట్ దగ్గరే తేడా కొడుతుంది. మరి ఇండియన్ 3ను లైకా ఎలా తీసుకువస్తుందో చూడాలి.

# చూసి నేర్చుకోవాలి



గుడ్ బ్యాడ్ అగ్లీ కి మొదట దేవీ నే మ్యూజిక్ డైరెక్టర్ కానీ తరువాత జరిగిన పరిణామాలతో దేవీ ప్లేసులోకి జీవీని రీ ప్లేస్ చేసింది మైత్రీ మూవీ మేకర్స్. జీవి ఇచ్చిన మ్యూజిక్ గుడ్ బాడ్ అగ్లీ విజయంలో కీలక పాత్ర పోషించింది. దేవిశ్రీ ప్రసాద్ హావ తగ్గడంతో నెక్ట్స జీవీ ప్రకాష్ పై సౌత్ ఇండస్ట్రీ ఆధారపడుతోంది. కోలీవుడ్ మాత్రమే కాదు టాలీవుడ్ కూడా వరుస ఆఫర్లను అందిస్తోంది. ప్రజెంట్ తమిళంలో గంపెడు సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఇడ్లీకడాయ్, పరాశక్తి,, మన్నాడీ, వాడివాసల్, మాస్క్ చేస్తున్నాడు. పరాశక్తి అతడి కెరీర్ లో మైల్ స్టోన్ వందవ సినిమాగా వస్తుంది. ఇటు తెలుగులో కూడా టూ ఫిల్మ్స్ కు కమిటయ్యాడు. సూర్య- వెంకీ అట్లూరి మూవీకి అతడే ఫిక్స్ కాగా, రీసెంట్లీ దుల్కర్ సల్మాన్ మూవీ ఆకాశంలో ఒకతారకు ఫైనల్ అయ్యాడు. మ్యూజిక్ డైరెక్టరుగా ఇంత బిజీలోనూ యాక్టింగ్ వదులు కోలేదు ఈ టాలెంటర్. హీరోగా అరడజన్ సినిమాలున్నాయి. వాటిల్లో కొన్నింటికీ కూడా అతడే కంపోజర్. ఇవే కాదు లైవ్ కాన్సర్ట్స్ నిర్వహిస్తూ మెస్మరైజ్ చేస్తున్నాడు. ఒక్క సినిమాకు ఆర్ఆర్, మ్యూజిక్ ఇవ్వడానికి సంవత్సరాలు తీసుకుంటున్నారు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్స్. కానీ జీవి చేసిన ప్రతి సినిమాకు తన వంతు న్యాయం చేస్తున్నాడు.

# ధనుష్ ఫ్యాన్స్ నజర్





కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ చేస్తున్న స్ట్రయిట్ తెలుగు సినిమా కుబేర. టాలీవుడ్ సీనియర్ హీరో అక్కినేని నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్నాడు. నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తోంది. ఏషియన్ సినిమాస్ సునీల్, రామ్ మోహన్ రావ్ నిర్మిస్తోన్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా రిలీజ్ అయిన ట్రైలర్ మంచి రెస్పాన్స్ రాబట్టడమే కాకుండా సినిమాపై అంచనాలు పెంచింది అనే చెప్పాలి.ధనుష్ కెరీర్ లోనే హయ్యెస్ట్ బడ్జెట్ తో వస్తున్న కుబేర జూన్ 20న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు ఫినిష్ చేసుకుంది. మొత్తం 3 గంటల 15 నిమిషాల నిడివి వచ్చిందట. దాంతో 14 నిమిషాలు ట్రిమ్ చేసి లాక్ చేశారట. సినిమా చుసిన సెన్సార్ సభ్యులు చిన్న చిన్న మార్పులు చేర్పులు సూచించి U/A సర్టిఫికెట్ అందజేసారు. కానీ ఈ సినిమా రన్ టైమ్ ధనుష్ ఫ్యాన్స్ ను కాస్త టెన్షన్ పెడుతుంది. 3 గంటలకు పైగా రన్ టైమ్ అంటే కాస్త ఇబ్బందే. సినిమా బాగుంటే ఓకే లేదంటే మొదటికే మోసం వస్తుందని కామెంట్స్ వస్తున్నాయి. ఇండియన్ 2, కంగువ, రెట్రో వంటి సినిమాలు ఎక్కువ రన్ టైమ్ తో వచ్చి ఆడియెన్స్ సహనాన్ని పరీక్షించాయి. కానీ శేఖర్ కమ్ముల పై ధనుష్ చాలా నమ్మకంగా ఉన్నాడు. కుబేర ఊహించిన దానికంటే భారీ హిట్ అవుతుందని కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. తెలుగు, తమిళ్ లో కుబేర రిలీజ్ కు భారీ ఎత్తున ఏర్పాట్లు చేసారు.

# 'రెట్రో' వెబ్ సిరీస్‌గా?




సూర్య నటించిన తాజా చిత్రం 'రెట్రో' (Retro), దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు తెరకెక్కించిన ఈ రొమాంటిక్ యాక్షన్ డ్రామా. థియేటర్లలో ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. ఎన్నో అంచనాలతో విడుదలైనప్పటి ఆశలని అడియాశలయ్యాయి. వింటేజ్ సూర్యని చూస్తాం అని అభిమానులు చాలా హోప్స్ పెట్టుకున్నప్పటికీ చివరికి నిరాశే మిగిలింది. అయితే ప్రజంట్ ఈ సినిమా నెట్ ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతున్నప్పటికి, తాజా సమాచారం ప్రకారం ఇప్పుడు ఈ సినిమాను మరో ఫార్మాట్ లో విడుదల చేసే ఆలోచనలో దర్శకుడు ఉన్నట్లు వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కార్తీక్ మాట్లాడుతూ.. 'రెట్రో' ఎక్స్టెండెడ్ వెర్షన్ కోసం ఓటీటీ ప్లాట్ ఫారాలతో చర్చలు జరుగుతున్నాయి. నాలుగు నెలల తర్వాత దీన్ని వెబ్ సిరీస్ రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చూస్తున్నా. ఇందులో కేవలం తొలగించిన సన్నివేశాలు మాత్రమే కాకుండా, బలమైన భావోద్వేగాలతో కూడిన అంశాలు కూడా ఉంటాయి. ప్రతి ఎపిసోడ్ ను సుమారు 40 నిమిషాల నిడివితో ప్లాన్ చేస్తున్నాం. హాస్యం, ప్రేమ, యాక్షన్ ఇలా ఒక్కో ఎపిసోడ్ లో ఒక్కో ఎలిమెంట్ ను హైలైట్ చేయాలనుకుంటున్నా' అని చెప్పారు. సినిమా మొత్తం 2 గంటల 48 నిమిషాల రన్ టైమ్ తో విడుదలై కొంతమంది ప్రేక్షకుల నుంచి నిడివిపై విమర్శలు ఎదుర్కొంది. అదే ఇప్పుడు ఈ ఎక్స్టెండెడ్ వెర్షన్ సిరీస్ రూపంలో వస్తే మరింత ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే అవకాశం ఉందని ఇలా ప్లాన్ చేసి ఉంటారు.




# మళ్లీ టై అప్ అవుతున్న



కోలీవుడ్ లో పూజా హెగ్డే మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రూపొందిన 'రెట్రో' సినిమాతో అమ్మడు డి గ్లామరస్ గా ఎంట్రీ ఇచ్చింది. కానీ లాభం లేకుండా పోయింది. అనుకునంత కమ్ బ్యాక్ అందుకోలేక పోయింది. ప్రస్తుతం పూజా తమిళ స్టార్ హీరో విజయ్ తో నటిస్తున్న 'జననాయకన్' సినిమాలో నటిస్తోంది. తాజాగా ఆమె పాత్రకు సంబంధించిన షూటింగ్ కూడా పూర్తయింది. ఇకపోతే 'కాంచన 4' మూవీ లోనూ పూజా కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. అది కూడా ముగియనుండగా.. ప్రస్తుతం ఆమె దగ్గర కొత్త సినిమాలేమీ లేవన్నది ఫిల్మ్ నగర్ టాక్. ఇక రజినీకాంత్ 'కూలీ' సినిమాలో కేవలం ప్రత్యేక పాత్రలో మాత్రమే కనిపించనుంది. దీంతో టాలీవుడ్ పై మళ్లీ దృష్టి పెట్టిందట ఈ బుట్టబోమ్మ.తాజాగా సమాచారం ప్రకారం పూజా హెగ్డే తాను ఓ టైమ్ లో కలిసిన మేనేజర్లు, డైరెక్టర్లు, నిర్మాతలతో మళ్లీ టచ్ లోకి వెళ్లిందని టాక్. ఇండస్ట్రీలో పరిస్థితులు ఎలా ఉన్నాయో, కొత్త ప్రాజెక్టులు ఏవైనా ఉన్నాయా అనే దిశగా అడిగి తెలుసు కుంటోందట. గతంలో ఆమెకు అవకాశాలు కల్పించిన వ్యక్తులతో మళ్లీ సంబంధాలు పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తోందట. ఇక తెలుగులో పూజా చివరిసారిగా 'ఆచార్య' సినిమాలో కనిపించింది. ఆ తర్వాత బాలీవుడ్ ప్రాజెక్టుల వైపు మొగ్గు చూపింది. కానీ అక్కడ ఆశించిన స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో తమిళ చిత్రాల పై ఫోకస్ పెంచింది. అదృష్టవశాత్తూ అక్కడ కొన్ని ప్రాజెక్టులు సెట్ అయ్యాయి. మరిక పాత పరిచయాలతో పూజా ప్రయత్నాలు ఎంత వరకు ఫలిస్తాయో చూడాలి.

# టీజర్.. రికార్డ్ మిలియన్ వ్యూస్

రెబల్ స్టార్ ప్రభాస్ లేటెస్ట్ సినిమా రాజాసాబ్. మారుతీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా పై భారీ ఎక్స్ పెక్టేషన్స్ ఉన్నాయి. ప్రభాస్ కెరీస్ లో తొలిసారి హార్రర్ రొమాంటిక్ కామెడీ మూవీ చేస్తున్నాడు. అందులోను ప్రభాస్ రెండు విభిన్నమైన లుక్స్ లో కనిపిస్తున్నాడు. ఇప్పటికే రివీల్ అయిన ఫస్ట్ లుక్ పోస్టర్స్, గ్లింప్స్ కు సూపర్ రెస్పాన్స్ వచ్చింది. లేటెస్ట్ గా రాజాసాబ్ టీజర్ ను రిలీజ్ చేసారు మేకర్స్.ఎప్పటినుండో ఈ సినిమా టీజర్ కోసం ఎదురు చుసిన ఫ్యాన్స్ ఆకలి తీర్చాడు మారుతీ. వింటేజ్ ప్రభాస్ ను మరోసారి చూపించదు. నిన్న విడుదలైన ఈ సినిమా టీజర్ అద్భుతమైన స్పందనతో పాటు రికార్డ్ మిలియన్ వ్యూస్ రాబడుతోంది. ఇప్పటి వరకు రిలీజ్ అయిన 24 గంటల్లో రాజా సాబ్ ట్రైలర్ 59 మిలియన్ వ్యూస్ రాబట్టి యు ట్యూబ్ ట్రెండింగ్ లో నంబర్ 1 లో దూసుకెళ్తుంది. రికారు మిలియన్ వ్యూస్ రాబట్టడంతో రెబల్ స్టార్ మరోసారి తన సత్తా ఏమిటో చూపించాడని ఫ్యాన్స్ ఖుషి అవుతున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్నఈ సినిమా ఈ ఏడాది డిసెంబరు 5న థియేటర్లలోకి సందడి చేయనుంది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ , రిద్ధి కుమార్ లతో రెబల్ స్టార్ రొమాన్స్ చేయబోతున్నాడు. ఈ ముగ్గురు భామలతో కలిసి ప్రభాస్ చేయబోయే మాస్ సాంగ్ సినిమాకే హైలెట్ గా నిలవబోతుందట. ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్ పై పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.





# సంచలనం సృష్టించిన 'పెద్ది'

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. టాలెంటెడ్ డైరెక్టర్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా, మ్యూజిక్ మాయాజాలకారుడు ఏఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే భారీ అంచనాలు క్రియేట్ చేసిన, ఈ సినిమా, నుండి విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ కి మంచి స్పందన లభించింది, మూవీ పై హైప్ మరింత పెరిగింది. డి గ్లామరస్ గా చరణ్ లుక్ మాత్రం అధిరిపోయింది అని చెప్పాలి. ఒకే ఒక్క బాల్ షాట్ తో సోషల్ మీడియాను షేక్ చేశాడు. ఇక తాజాగా ఈ మూవీ డిజిటల్ రైట్స్ పై సంచలన సమాచారం బయటకు వచ్చింది.ప్రముఖ దిగ్గజ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్ ఈ చిత్ర డిజిటల్ హక్కులు భారీ మొత్తానికి సొంతం చేసుకుందని టాక్. అందుతున్న సమాచారం ప్రకారం, ఈ రైట్స్ ను నెట్ ఫ్లిక్స్ ఏకంగా రూ.105 కోట్లకు తీసుకుందట. ఈ రేటు, తెలుగులో ఇప్పటి వరకు వచ్చిన డిజిటల్ రైట్స్ ఒప్పందాల్లో, టాప్ రేంజ్ లో నిలిచింది. ఈ డీల్ తో 'పెద్ది' సినిమాపై ఉన్న క్రేజ్ స్పష్టంగా కనిపిస్తోంది. దీని గురించి అధికారికంగా ప్రకటన రానప్పటికీ, ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించడం ఖాయమని ఫ్యాన్స్ అంచనా వేస్తున్నారు.

# 'పొలిటికల్' కిడ్

బాలీవుడ్ లో మోస్ట్ అఫ్ ది క్రేజీ ప్రాజెక్టుల్లో వారసులే హీరోలు, హీరోయిన్లు. కానీ ఈ లెగసీలో రాజ్ కుమార్ రావ్, కార్తీక్ ఆర్యన్, కృతి సనన్ లాంటి సెల్ఫ్ మేడ్ యాక్టర్స్ సక్సెస్ తో పాటు ఆఫర్లు కొల్లగొడుతున్నారు. ఇప్పుడు వారి జాబితాలో చేరిపోయింది శార్వరి వాఘ్. పొలిటికల్ బ్యాగ్రౌండ్ నుండి వచ్చిన శార్వరి ప్రజెంట్ బీటౌన్ ఏలేందుకు ప్రిపేరవుతోంది. అసిస్టెంట్ డైరెక్టర్ నుండి హీరోయిన్ మెటీరియల్ గా ఛేంజైన బ్యూటీ ప్రజెంట్ వరుస ప్రాజెక్టులకు కమిటవుతూ రైజింగ్ స్టార్ గా మారుతోంది.బంటీ ఔర్ బబ్లీ2తో కెమెరా వెనుక నుండి ఫ్రంట్ కు వచ్చి 'ముంజ్యా'తో బాగా క్లిక్ అయ్యింది. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కొట్టడంతో శార్వరీ పేరు ఇండస్ట్రీలో మార్మోగిపోయింది. వేదలో మైండ్ బ్లోయింగ్ ఫెర్ఫామెన్స్ తో క్రేజీ ప్రాజెక్టులను దక్కించుకుంది. యష్ రాజ్ ఫిల్మ్స్ సినిమాటిక్ యూనివర్స్ లో ఫస్ట్ ఉమన్ సెంట్రిక్ ఫిల్మ్ ఆల్ఫాలో నటిస్తోంది. ఆలియా భట్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోబోతోంది. అలాగే వార్ 2లో హృతిక్-తారక్ తో భారీ డ్యాన్స్ సీక్వెన్స్ ఉండనున్నట్లే ఆల్ఫాలో కూడా ఆలియా, శార్వరి మధ్య పవర్ ఫ్యాక్డ్ డ్యాన్స్ నంబర్ ఉండేలా ప్లాన్ చేస్తోందట యశ్ రాజ్ ఫిల్మ్స్. ఇక ఇవే కాకుండా ధూమ్ 4లో ముంజ్యా బ్యూటీనే ఫైనల్ చేశారన్న టాక్ ఉంది. ఇప్పుడు మరో క్రేజీ మూవీకి ఫిక్స్ అయ్యిందట శార్వరీ. బాలీవుడ్ డైరెక్టర్ ఇంతియాజ్ ఆలీ నెక్ట్స్ ప్రాజెక్టులో ఫైనల్ అయ్యిందట. ఆగస్టులో షూటింగ్ స్టార్ట్ చేసి నెక్ట్స్ ఏప్రిల్ కు మూవీని రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ లైనప్, ఈ క్రేజీ ప్రాజెక్టులు చూస్తుంటే త్వరలోనే బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా మారేందుకు శార్వరి దూసుకెళ్తున్నట్టు కనిపిస్తోంది.




Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**